# వాస్తవం

డెయిలీ. కామ్

ఉన్నది ఉన్నట్లుగా

డిజిటల్ పత్రిక

గురువారం 23.07.2026

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి(కె.ఆర్)


## పత్రికల గౌరవం నిలిచేది వార్తల ప్రాధాన్యతను గుర్తించడంలోనే

కే.ఆర్. పాత్రికేయ పాఠం

6

ఏది ప్రాధాన్యత కల అంశం అనేది తెలియాలి?

# మోదీని గద్దె దించుదాం

# రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుందాం

4లో..

## దేశం కోసం రక్తం చిందించిన చరిత్ర గాంధీ కుటుంబానిది

యువత పక్షాన నిలిచి మోదీపై పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసే వరకు ఈ పోరా టం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అందరం కలిసి పోరాటం చేసి మోదీని గద్దె దించి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుందామని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.



అంబేద్కర్ అందించిన రాజ్యాంగం సాక్షిగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై కేంద్ర ప్రభుత్వ, పోలీసుల పాశవిక దాడికి ఖండిస్తున్నామని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన ధర్నా కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నీట్ పరీక్ష పేపర్ లీక్‌తో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు.

- లాఠీలు కాంగ్రెస్‌కు కొత్త కాదు
- నీట్ పరీక్ష పేపర్ లీక్‌తో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది
- విద్యార్థుల జీవితాలతో బీజేపీ నేతల చెలగాటం
- ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసే వరకు పోరాటం
- దేశాన్ని దోచుకుంటుంటే చూస్తూ ఊరుకోం

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

## డిగ్రీలు పుష్కలం... నైపుణ్యాలే కరువు!



3లో..

## తెలంగాణలో అదనపు ధాన్యం కొనుగోలుకు కేంద్రం ఆమోదం



**హైదరాబాద్, జులై 22 :** తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా వడ్ల కొనుగోలు చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే ఉన్న కొనుగోలు లక్ష్యానికి అదనంగా 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో రైతులకు పెద్ద ఊరట లభించనుంది.కేంద్ర ప్రభుత్వం సవరించిన వరి కొనుగోలు అంచనాను బియ్యం రూపంలో 43 లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్ణయించింది. ఈ నిర్ణయం ద్వారా తెలంగాణలో రైతులు పండించిన ధాన్యానికి మరింత మార్కెట్ భరోసా లభించనుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతించింది. ఇదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా వాహనాల స్థాన నిర్ధారణ వ్యవస్థ అమలుపై కూడా కేంద్రం కీలక ఆదేశాలు (మిగతా 4లో..)

## లీక్‌పై చర్చకు సిద్ధం: కేంద్రం



**న్యూఢిల్లీ, జూలై 22:** నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై సమగ్రంగా చర్చించేందుకు సిద్ధమని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ అంశంపై లోక్‌సభలో చర్చకు సిద్ధంగా ఉన్నామని బుధవారం వెల్లడించింది. వీధుల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టడం వల్ల ఎలాంటి ఫలితం ఉండదని ప్రతి పక్షాలకు స్పష్టం చేసింది. బుధవారం ఉదయం వాయిదా అనంతరం లోక్‌సభ సమావేశమైన వెంటనే స్పీకర్ ఓం బిర్లా నీట్ పేపర్ లీకేజీపై ఓ ప్రకటన చేయాలని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజును ఆదేశించారు. పేపర్ లీకేజీ అంశంపై సమగ్రంగా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రిజిజు ప్రకటించారు. అయితే, ఏ నిబంధన కింద ఈ అంశంపై చర్చ చేపట్టాలనేది నిర్ణయించడంతోపాటు తేదీ, సమయాన్ని ఖరారు చేయడానికి అన్ని పార్టీల సభాపక్ష నేతలతో స్పీకర్ సమావేశం కావాలని కోరారు. అదేసమయంలో జోక్యం చేసుకున్న కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్.. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నారు. పార్లమెంటులో ఇతర అంశాలన్నింటినీ పక్కనపెట్టి, దీనిపైనే ప్రధానంగా చర్చించాలని డిమాండ్ చేశారు. కాగా, సభ వాయిదా పడిన అనంతరం కేంద్ర మంత్రి రిజిజు విలేకరులతో మాట్లాడారు. సున్నితమైన ఈ అంశంపై పార్లమెంటులో చర్చించకుండా ప్రతిపక్షాలు రోడ్లెక్కి రచ్చచేయడం సరికాదన్నారు. నీట్ పేపర్ లీక్‌పై చర్చకు సిద్ధమని ప్రభుత్వం నుంచి ప్రకటన వచ్చిన నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. పార్లమెంట్ ప్రాంగణంలో ఈ భేటీ జరిగింది. ఇదిలా ఉండగా, నీట్ పేపర్ లీక్ ఘటనను ప్రతిపక్షాలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయం చేస్తున్నాయని కేంద్ర మంత్రి జేపీ నడ్డా విమర్శించారు. విద్యార్థుల సమస్యలను ఏ పార్టీ కూడా రాజకీయం చేయవద్దని సూచించారు.

## ఔషధాలపై ట్రంప్ సుంకాల పిడుగు

### భారత పరిశ్రమలపై ప్రభావం : నిపుణులు



**న్యూఢిల్లీ, జూలై 22:** అమెరికా దిగుమతి చేసుకునే ఔషధాలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల కొరడా ఝుళిపించారు. అమెరికా ఔషధరంగాన్ని బలోపేతం చేయడంతోపాటు, విదేశాలకు తరలిపోయిన ఔషధ పరిశ్రమలను తిరిగి రప్పించడమే లక్ష్యంగా ఆయన సంచలన నిర్ణయం తీసుకున్నారు. దిగుమతి సుంకాన్ని భారీగా పెంచారు. అన్ని జనరిక్ ఔషధాలపై 2028, ఆగస్టు నుంచి 100 శాతం, తదుపరి సంవత్సరం 2029, ఆగస్టు నుంచి 200 శాతం సుంకాలు విధించనున్నట్టు ప్రకటించారు. సుంకాల విధింపును ఆయన సమర్థించుకున్నారు. అమెరికా ఫార్మారంగాన్ని బలోపేతం చేయడం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఈ నూతన విధానం మేరకు ఈ ఏడాది ఆగస్టు నుంచి 2028, ఆగస్టు వరకు జనరిక్ ఔషధాలపై సుంకాలను పూర్తిగా ఎత్తేశారు. అయితే, ఆ తర్వాత మాత్రం రెట్టింపు సుంకాలు విధించనున్నారు. కాగా, ట్రంప్ నిర్ణయం భారత ఔషధ ఎగుమతి రంగానికి భారీ దెబ్బేనని నిపుణులు చెబుతున్నారు. దేశం నుంచి ఏటా రూ.93 వేల కోట్లకు పైగా విలువైన ఔషధాలు అమెరికాకు ఎగుమతి అవుతున్నాయని, వీటిపై సుంకాలు విధిస్తే ఔషధ రంగం విలవిల్లాడుతుందని తెలిపారు. ప్రస్తుతం భారత్‌కు చెందిన ఫార్మా కంపెనీలు వాటి ఉత్పత్తుల్లో 40 నుంచి 50 శాతం ఔషధాలను అమెరికాకు ఎగుమతి చేస్తున్నాయి.

## సొంతింటి కల నెరవేరుస్తాం

### మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, జులై 22:** నగరంలోని గాంధీభవన్‌లో ప్రతి వారం ప్రజలతో ముఖాముఖి నిర్వహించడం మంచి పరిణామమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజల సమస్యలు వినేందుకు ఎలాంటి అవకాశం ఉండేది కాదని విమర్శించారు. పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీక అయిన సొంతింటి కలను తమ ప్రభు త్వం నెరవేర్చుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే 7.5 లక్షల ఇళ్లను మంజూరు చేసి ఇచ్చామని పేర్కొన్నారు. హైదరాబాద్ వంటి నగరాల్లో సొంత ఇల్లు అనేది చాలా మందికి కలగానే ఉండేదని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. భూముల ధరలు భారీగా ఉన్న హైదరాబాద్‌లోనూ ప్రజలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

**హైదరాబాద్ ప్రజలు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి : మంత్రి**

భాగ్యనగరంలో సొంతింటి కోసం అర్హులైన ప్రజలు మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మంత్రి పొంగులేటి సూచించారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారు కూడా మరోసారి అప్లై చేసుకోవాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే సమస్యల్లో పరిష్కారమయ్యే వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు.

## ఇక వైరస్‌లు అన్నింటికీ ఒకే టీకా

### అభివృద్ధి చేస్తున్న శాస్త్రవేత్తలు



**ఢిల్లీ:** ప్రపంచాన్ని వణికించిన కోవిడ్-19, సార్స్, ఎబోలా వంటి వైరస్‌లకు ఒక్కో వైరస్‌కు ఒక్కో టీకా అభివృద్ధి చేయాల్సిన పరిస్థితి ఉంది. అయితే భవిష్య త్తులో ఒకే టీకాతో ఒకే వైరస్ కుటుంబానికి చెందిన అనేక వైరస్‌ల నుంచి రక్షణ కల్పించే సాంకే తికత అం దుబ ాటులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు కృత్రిమ మేధస్సు సాయంతో రూపొందించిన కొత్త తరహా వ్యాక్సిన్ సాంకేతికత వైరస్‌ల మొత్తం కుటుంబంపైనే రోగనిరోధక శక్తిని పెంపొందించే సామర్థ్యం కలిగి ఉండే అవకాశాలు ఉన్నాయని తాజా పరిశోధనలు సూచిస్తున్నాయి. భవిష్యత్తులో మరో మహమ్మారిని అడ్డుకునే దిశగా ఇది కీలక ముందడుగు అవుతుందని పరిశోధకులు భావిస్తున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న చాలా టీకాలు ఇప్పటికే వ్యాపించిన వైరస్ రకాలను లక్ష్యంగా చేసుకుని తయారవుతాయి. కానీ వైరస్‌లు వేగంగా రూపాంతరం చెందుతుండటంతో, కొన్ని నెలల తర్వాత వ్యాప్తి చెందే కొత్త వేరియంట్‌పై అవి తక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అందువల్ల వైరస్‌ను వెంబడిస్తూ కొత్త టీకాలు తయారు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.ఈ సమస్యకు పరిష్కారంగా శాస్త్రవేత్తలు ఏఐ సాయంతో ఒకే వైరస్ కుటుంబంలోని అన్ని రకాల వైరస్‌లలో సాధారణంగా ఉండే కీలక భాగాలను గుర్తించారు. రోగనిరోధక వ్యవస్థ గుర్తించే ఆ సాధారణ లక్షణాలనే లక్ష్యంగా చేసుకుని కొత్త టీకాను రూపొందించారు. దీంతో ఒక్క వేరియంట్‌కే కాకుండా అదే కుటుంబానికి చెందిన అనేక వైరస్‌లపై రోగనిరోధక శక్తిని పెంచే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. ఆధునిక ఏఐ సాంకేతికతను ఉపయోగించి మరింత వేగంగా, మరింత కచ్చితంగా వ్యాక్సిన్‌లను అభివృద్ధి చేసే వేదికను రూపొందిస్తున్నామని, ఇది టీకాల తయారీలో కొత్త యుగానికి నాంది పలికే అవకాశముందని అంటున్నారు.

# రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ గోదావరిఖనిలో కాంగ్రెస్ ధర్నా

**ప్రజాస్వామ్యాన్ని అణచివేసే ప్రయత్నాలను కాంగ్రెస్ ఎప్పటికీ సహించదు : ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్**

**వాస్తవం : గోదావరిఖని, జులై,22**

ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జరిగిన నిరసన కార్యక్రమంలో నిరుద్యోగ యువతపై దాడి చేయడాన్ని నిరసిస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం ఎదుట చేపట్టిన ఆందోళనలో పాల్గొన్న లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ బుధవారం గోదావరిఖని మున్సిపల్ కార్యాలయం ఎదుట రాజీవ్ రహదారిపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ... లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పించిందని, ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్ష నాయకుడిని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విలువలను అవమానపరచడమేనని అన్నారు. ప్రతిపక్షం ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం, విమర్శిస్తే కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించడం బీజేపీ ప్రభుత్వంలో నిత్యకృత్యంగా మారిందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను గౌరవించాల్సిన కేంద్ర ప్రభుత్వం నిరంకుశ ధోరణితో వ్యవహరించడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, ప్రజల హక్కులను పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జరుగుతున్న ఈ పోరాటంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గబోమని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేషన్ అధ్యక్షుడు, పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ చైర్మన్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన ప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నిజాం పాలనపై ధిక్కార స్వరం.. సాహితీ శిఖరం దాశరథి

**ప్రజల కన్నీళ్లను అగ్నిధారగా మలిచిన ప్రజాకవి : పిన్నింటి రత్నం**



**వాస్తవం : మద్దూరు**

ఽతెలంగాణ సాహితీ దిగ్గజం,మహాకవి దాశరథి కృష్ణమాచార్య నేటి తరానికి,కవులకు, సాహితీవేత్తలకు మార్గనిర్దేశకుడని తెలంగాణ సాంస్కృతిక సారథి కవి,గాయకులు పిన్నింటి రత్నం కొనియాడారు. బుధవారం కొమురవెల్లి మండల కేంద్రంలో దాశరథి కృష్ణమాచార్య 101వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిన్నింటి రత్నం దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ప్రజల కన్నీళ్లను అగ్నిధారగా మలిచి,నిజాం నిరంకుశ పాలనపై తన అక్షరాలనే ఆయుధాలుగా గురిపెట్టిన ధిక్కార స్వరం,సాహితీ శిఖరం దాశరథి అని కొనియాడారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ నా తెలంగాణ కంజాత కల్పవల్లి అని సగర్వంగా చాటిచెప్పి, తన రచనల ద్వారా ప్రజల్లో ప్రజా చైతన్యాన్ని రగిలించిన మహాకవి ఆయనేనని గుర్తుచేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి తన అక్షరాలతో ఊపిరిలూదిన ప్రజాకవి దాశరథి అని,ఎన్నో అభ్యుదయ పాటలు, సినీ గీతాలు రాసి ప్రేక్షక హృదయాల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి గ్రామ ఉపసర్పంచ్ పోతుగంటి శ్రీనివాస్, సాహితీ అభిమానులు రాములు, అమరేందర్,శ్రీకాంత్, కళాకారులు పిన్నింటి సాయిలు, గడ్డం పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్ట్ అప్రజాస్వామికం

**హనుమకొండలో కాంగ్రెస్ భారీ నిరసన**
**ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం**
**కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విమర్శలు**

**వాస్తవం : హనుమకొండ:**



ఏఐసీసీ, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో డీసీసీ భవన్ వద్ద కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా భారీ ఆందోళన, ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు తదితరులు పాల్గొన్నారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తోందని విమర్శించారు. రాహుల్ గాంధీతో పాటు ప్రతిపక్ష నాయకుల అరెస్టులు ప్రజాస్వామ్యానికి మచ్చ అని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన పరీక్షల్లో జరిగిన అవకతవకలు కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేసి పారదర్శకమైన పరీక్షా విధానాన్ని అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు కుచ్చాన రావాలి, ఇవి శ్రీనివాస్ రావు, భట్టి శ్రీనివాస్ రావు, గ్రంథాలయ చైర్మన్ అజీజ్ ఖాన్, మాజీ మేయర్ గుండు సుధారాణి, ఏనుమాముల మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక, కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ పింగిలి వెంకట్రామ్ నర్సింహా రెడ్డి, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ నాసీర్ అహ్మద్, జిల్లా, మండల, డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా పెద్దపల్లి జిల్లా అధ్యక్షులుగా మచ్చ విశ్వాస్ నియామకం

**వాస్తవం : గోదావరిఖని**



భారతీయ జనతా పార్టీ తెలంగాణ శాఖ అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు ఆదేశాల జిల్లా అధ్యక్షులు కర్రె సంజీవ్ రెడ్డి సూచన మేరకు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు క్రాంతి కిరణ్ గోదావరిఖని విద్యానగర్‌కు చెందిన మచ్చ విశ్వాస్ భారతీయ జనతా పార్టీ ఎస్సి మోర్చా పెద్దపల్లి జిల్లా అధ్యక్షులుగా నియామకం పత్రం జారీ చేశారు. మచ్చ విశ్వాస్ మాట్లాడుతూ....2008 లో పార్టీలో సామాన్య కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించి అంచాలంచెలుగా పనిచేస్తూ 2017లో భారతీయ జనతా యువమోర్చా రామగుండం కార్పొరేషన్ ఏరియా ఉపాధ్యక్షులుగా,స్వయం సేవక్‌గా,2025లో జరిగిన ఎమ్మెల్సీ ఎలక్షన్స్,టీచర్స్ ఎమ్మెల్సీ ఎలక్షన్స్ అసెంబ్లీ కన్వీనర్ గా,2026 లో జరిగిన కార్పొరేషన్ ఎలక్షన్స్ 9వ డివిజన్ అభ్యర్థిగా పోటీ చేసి ప్రస్తుతం సర్ జనగామ మండల్ ఇన్చార్జిగా పనిచేస్తున్నారు. ఈ బాధ్యతకి సహకరించిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, జిల్లా అధ్యక్షులు కర్రె సంజీవరెడ్డికి, ఎస్సి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్ , మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య ,జాతీయ ఎస్సి మోర్చా కార్యదర్శి ఎస్ కుమార్, రాష్ట్ర నాయకులు దుగ్యాల ప్రదీప్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోమల మహేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బల్మూరి వనిత ,ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసిపేట శివాజీ, మేరుగు హనుమంత గౌడ్, అమరేందర్ రావు, మాజీ జిల్లా అధ్యక్షులు రావుల రాజేందర్, కందుల సంధ్య రాణి, సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**-వరంగల్ అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన డిప్యూటీ సీఎం**



**వాస్తవం : వరంగల్ ప్రతినిధి: జూలై 22**

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసే కార్యక్రమంలో పాల్గొనేందుకు వరంగల్‌కు విచ్చేశారు. వారికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఎన్ఐటి గెస్ట్ హౌస్ వద్ద ఘన స్వాగతం పలికారు. పుష్ప గుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారి వెంట వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ జంక్షన్‌లో కాంగ్రెస్ భారీ ధర్నా



**వాస్తవం : వరంగల్ ప్రతినిధి:** ఢిల్లీలో విద్యార్థులపై జంతర్ మంతర్ వద్ద పోలీసులు లాఠీ చార్జ్ చేయడాన్ని ఖండిస్తూ.. వరంగల్ తెలంగాణ జంక్షన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల్ నవీన్ రాజ్ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిరసన కార్యక్రమం చేపట్టారు. ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి రాష్ట్ర నాయకులు గోపాల్ నవీన్ రాజ్ మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్‌లను మాట్లాడనివ్వకుండా గొంతు నొక్కుతున్నారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోడీ ఇంటి ముట్టడికి వెళ్తున్న కాంగ్రెస్ నేతలను ఢిల్లీ పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి లాఠీచార్జ్ చేసి దూరంగా తరలించారని మండి పడ్డారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలను నిరసిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

# బస్వాపూర్ ప్రజల అవస్థలు.. పరిష్కారం ఎప్పుడో?



**వాస్తవం : కాటారం**

కాటారం మండలంలోని మేడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బస్వాపూర్ గ్రామం నుంచి శ్మశాన వాటిక, వ్యవసాయ పొలాలకు వెళ్లే రహదారి చినుకు పడితేనే బురదమయంగా మారుతోంది. సుమారు రెండు కిలోమీటర్ల మేర రహదారిపై బురద పేరుకుపోవడంతో రైతులు పొలాలకు, గ్రామస్తులు శ్మశాన వాటికకు వెళ్లేందుకు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం వచ్చిన ప్రతిసారీ ఇదే సమస్య పునరావృతమవుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పక్కా రహదారి నిర్మాణం చేపట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

# మృతుడి కుటుంబానికి పరామర్శ

**బియ్యం, నగదు అందజేత**

**వాస్తవం : కోనరావుపేట**



కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జిన్న చంద్రయ్య కుటుంబాన్ని పరామర్శిస్తు బుధవారం గ్రామపంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు 25 కిలోల బియ్యం, రూ.1,000 నగదు ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచా యతీ ప్రజలకు అండగా నిలుస్తుందని, కష్టకాలంలో ప్రతి కుటుంబానికి తోడుగా ఉం టామని సర్పంచ్ జిన్న అనూష- అనిల్ తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తు చంద్రయ్య ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఈ కార్యక్ర మంలో గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ వాసంపెల్లి శ్రీనివాస్, వార్డు సభ్యులు జాగిరి కిరణ్, మొకెనపెల్లి బాలరాజు, సత్తయ్య, పర్శరాములు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

**వాస్తవం : కాటారం**



భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్ర మాన్ని కాటారం మండల ఇన్‌చార్జి, డీసీసీ ఉపాధ్యక్షుడు అయిత రాజిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు చింతకాని, చిద్నెపల్లి, కాటారం గ్రామాల్లో పరిశీలించారు. ఓటరు జాబితా సవరణ, గణన ఫారాల పంపిణీ, సేకరణ, ధృవీకరణ పనులను సమీక్షించి, అర్హులైన ప్రతి ఒక్కరూ గణన ఫారాలు సమర్పించి ఓటరు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్య క్షుడు చీమల సందీప్, సర్పంచ్ బాల్నే జగదీష్, అజ్మీర రఘురాం నాయక్, చీర్ల తిరుప తిరెడ్డి, చీమల రాజు, కొట్టే ప్రభాకర్, జాగిరి రాజబాబు గౌడ్, సేనం సమ్మయ్య, అక్కపాక మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్స్ సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్స్ హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

# డిగ్రీలు పుష్కలం... నైపుణ్యాలే కరువు!

**( పెరిగిన పట్టాలు, తరిగిన ఉద్యోగార్హత: యువత ఎదుర్కొంటున్న నిశ్శబ్ద సంక్షోభంపై ప్రత్యేక కథనం)**



డా. సూర్యదేవర రామకృష్ణ
9490754169

ప్రతి ఏటా వేసవి సమీపిస్తున్న కొద్దీ మార్చి, ఏప్రిల్ నెలల వేళ దేశవ్యాప్తంగా వందలాది కళాశాలల్లో స్నాతకోత్సవాల సందడి అంబరాన్ని తాకుతోంది. నల్లటి గౌన్లు, చేతిలో మెరిసే డిగ్రీ పట్టాలు, గుండెల్లో ఆశల హరివిల్లులు, కళ్లల్లో భవిష్యత్తుపై కోటి ఆశలతో లక్షలాది మంది నవయువకులు క్యాంపస్‌ల సరిహద్దులు దాటి బయటి ప్రపంచంలోకి అడుగుపెడుతున్నారు. కానీ, ఆ రంగుల కలల ప్రయాణం తీరా బయటకు వచ్చాక మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోతోంది. ఇంజనీరింగ్, పీజీ డిగ్రీ పట్టాలు చేతిలో పతకాలుగా మెరుస్తున్నా, ప్రాక్టికల్ ఇంటర్వ్యూ గదిలోకి వెళ్లగానే అడిగే ఒక్క ప్రత్యక్ష ప్రశ్నకు నోరెళ్లబెడుతున్న యువత సంఖ్య రోజురోజుకూ ఆందోళనకరంగా పెరుగుతోంది. డిగ్రీలు బోలెడు ఉన్నాయి. అసలు ఉద్యోగం చేయగలిగే నైపుణ్యం ఎక్కడ ఉందో వెతుక్కోవాల్సి వస్తోంది అని ఇవాళ దేశవ్యాప్తంగా ప్రతి ఉద్యోగ ప్రదాత, ప్రతి తల్లిదండ్రి తీవ్రంగా వాపోతున్నారు.

**గణాంకాల వెనుక గుండెకోత:**

ఇటీవల వెలువడిన 'ఇండియా స్కిల్స్ రిపోర్ట్ 2026' నివేదిక దేశంలోని విద్యా వ్యవస్థ పరిస్థితికి, నిరుద్యోగిత స్వరూపానికి అద్దం పడుతోంది. లక్ష మందికి పైగా అభ్యర్థులపై నిర్వహించిన సమగ్ర గ్లోబల్ ఎంప్లాయబిలిటీ అసెస్‌మెంట్ పరీక్ష ఆధారంగా రూపొందించిన ఈ నివేదిక ప్రకారం, 2025లో 54.81 శాతంగా ఉన్న దేశ యువత సరాసరి ఉద్యోగ సామర్థ్యం (ఎంప్లాయబిలిటీ) 2026 నాటికి 56.35 శాతానికి స్వల్పంగా పెరిగింది. వినడానికి ఇది కొంత ఊరటనిచ్చే విషయమే అయినప్పటికీ, లోతుగా పరిశీలిస్తే దీని వెనుక పెను అసమానత స్పష్టంగా కనిపిస్తోంది.కంప్యూటర్ సైన్స్, ఐటీ విభాగానికి చెందిన విద్యార్థుల ఉద్యోగ నైపుణ్యాలు వరుసగా 80 శాతం, 78 శాతం స్థాయిలో నమోదు కాగా, వృత్తి విద్యా రంగాలైన ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థుల్లో ఇది కేవలం 45.95 శాతం, 32.92 శాతాలకే పరిమితమైపోవడం శోచనీయం. అంటే, ఒకే దేశంలో, ఒకే రకమైన సామాజిక వాతావరణంలో చదువుకుంటున్న విద్యార్థుల్లో సగం మంది కార్పొరేట్ రంగానికి సిద్ధంగా ఉంటే, మిగతా సగం మంది చదువు పూర్తయినా మార్కెట్ అవసరాలకు ఆమడ దూరంలో నిలిచిపోతున్నారు.ఇక సాంప్రదాయ ఇంజనీరింగ్ డిగ్రీలైన బి.ఇ/బి.టెక్ విద్యార్థులు 70.15 శాతంతో కొంత వరకు నిలదొక్కుకోగా, మేనేజ్‌మెంట్ పట్టభద్రుల (ఎంబీఏ) పరిస్థితి దయనీయంగా మారింది. వీరి ఉద్యోగ సామర్థ్యం గతేడాది 78 శాతం నుంచి ఏకంగా 72.76 శాతానికి దిగజారింది. పరిశ్రమల నిపుణులు ఎంబీఏ డిగ్రీల నాణ్యతపై పెదవి విరుస్తున్నారనడానికి ఇది నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది.

**అకడమిక్ ఇన్‌ఫ్లేషన్:**


**మార్కెట్లో పడిపోయిన పట్టా విలువ:**

ఆర్థిక వ్యవస్థలో కరెన్సీ నోట్లను ఇష్టారాజ్యంగా ముద్రిస్తే రూపాయి విలువ ఏ విధంగానైతే పడిపోతుందో, విద్యా రంగంలో కూడా సరిగ్గా అదే జరుగుతోంది. దీన్నే విద్యావేత్తలు "అకడమిక్ ఇన్‌ఫ్లేషన్" అని వ్యాఖ్యానిస్తున్నారు. ఒకప్పుడు ఇంజనీరింగ్ లేదా డిగ్రీ చదివారంటే సమాజంలో అరుదైన గౌరవం లభించేది. కానీ, గత రెండు దశాబ్దాలుగా గడప గడపకూ వెలిసిన ప్రైవేటు కళాశాలలు, పెరిగిన సీట్ల సంఖ్య నాణ్యతా ప్రమాణాలను తీవ్రంగా దెబ్బతీశాయి. ఫలితంగా డిగ్రీ అనేది కేవలం దరఖాస్తు చేసుకోవడానికి పరిమితమైన ఒక కనీస కాగితపు అర్హతగా మారిపోయింది తప్ప, నైపుణ్యానికి కొలమానంగా నిలబడలేకపోతోంది. గతంలో డిగ్రీ చదివితే వచ్చే ఉద్యోగాలకు ఇప్పుడు పీజీలను, అదనపు సర్టిఫికేషన్లను కోరుతున్నారు. పని స్వభావం మారకపోయినప్పటికీ అర్హతల స్థాయిని పెంచేయడం వల్ల విద్యార్థులపై, వారి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం, మానసిక ఒత్తిడి పెరుగుతోందే తప్ప, వారిలోని ఆచరణాత్మక నైపుణ్యాలు పెరగడం లేదని రిక్రూట్‌మెంట్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

**సిలబస్ పాతది... సవాళ్లు కొత్తవి!:**

కార్పొరేట్ వర్గాలు నిరంతరం లేవనెత్తుతున్న ప్రధాన విమర్శ కాలం చెల్లిన పాఠ్యాంశాలు! సాంకేతికత శరవేగంగా మారుతున్నా, విద్యా సంస్థల్లో బోధించే కరికులం మాత్రం దశాబ్దాల క్రితంటి రూపంలోనే మూలుగుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , డేటా అనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి విప్లవాత్మక అంశాలు ఇవాళ ఉద్యోగ మార్కెట్‌ను శాసిస్తుంటే, చాలా కళాశాలల్లో ఇప్పటికీ పాత కాలపు పాఠాలనే వల్లె వేయిస్తున్నారు. పుస్తకాల్లోని థియరీకి ప్రాధాన్యమిస్తూ, ఆచరణాత్మక (ప్రాక్టికల్) నాలెడ్జ్‌ను సంపూర్ణంగా విస్మరిస్తున్నారు.పరీక్షల్లో ర్యాంకులు, మార్కులు తెచ్చుకోవడమే పరమావధిగా సాగుతున్న ఈ యాంత్రిక విద్యలో, వాస్తవ ప్రపంచంలోని సమస్యలను పరిష్కరించే విశ్లేషణాత్మక ఆలోచనకు తావు లేకుండా పోతోంది. 2026 నాటికి వివిధ విద్యా విభాగాల్లోని విద్యార్థుల ఉద్యోగ సామర్థ్య వ్యత్యాసాలను స్పష్టంగా చూపుతోంది. కంప్యూటర్ సైన్స్ (80%), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (78%) చదివిన విద్యార్థులు అత్యధిక ఉద్యోగార్హత నైపుణ్యాలతో ముందంజలో ఉండగా, బి.ఇ/బి.టెక్ విద్యార్థులు 70.15 శాతంతో పర్వాలేదనిపిస్తున్నారు. అయితే, వృత్తి విద్యా కోర్సులైన ఐటీఐ (45.95%), పాలిటెక్నిక్ (32.92%) విద్యార్థుల ఉద్యోగ సామర్థ్యం చాలా తక్కువగా ఉండటం గమనార్హం. సాంకేతిక రంగానికి చెందిన ఉన్నత చదువులకు, ప్రాక్టికల్ డిప్లొమా కోర్సులకు మధ్య నైపుణ్యాల విషయంలో తీవ్రమైన అసమానత ఉందని ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. అయితే, ఈ విఫల వ్యవస్థకు కేవలం విద్యాసంస్థలనే బాధ్యులను చేయడం భావ్యం కాదు. విమర్శలు గుప్పించే కార్పొరేట్ కంపెనీలు కూడా తమ బాధ్యతను విస్మరిస్తున్నాయి. ఒకప్పుడు సంస్థలే తాజా గ్రాడ్యుయేట్లను ఎంపిక చేసుకుని, కొన్ని నెలల పాటు సొంత ఖర్చులతో ఇన్-హౌస్ శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దేవి. కానీ నేటి పోటీ ప్రపంచంలో ఖర్చులు తగ్గించుకునే క్రమంలో పరిశ్రమలు "రెడీమేడ్" నైపుణ్యాలున్న వారి కోసమే వెతుకుతున్నాయి.మరోవైపు ప్రభుత్వ విధానాల్లోనూ స్పష్టమైన లోపాలు కనిపిస్తున్నాయి. కొత్త కళాశాలలకు అనుమతులు మంజూరు చేయడంలో చూపిస్తున్న ఉత్సాహం, ఆయా సంస్థలు ఎలాంటి ప్రమాణాలు పాటిస్తున్నాయో పర్యవేక్షించడంలో కొరవడుతోంది.

**సాంకేతిక పరిజ్ఞానం ఎంత ఉన్నప్పటికీ, కమ్యూనికేషన్ స్కిల్స్, బృందంతో కలిసి పనిచేసే నైపుణ్యం, సమయానుకూల నిర్ణ యాలు తీసుకునే శక్తి వంటి "సాఫ్ట్ స్కిల్స్" లేకపోవడం యువతను బాగా దెబ్బతీస్తోంది. ఇంగ్లీష్ మీడియంలో చదివి నప్పటికీ ఆత్మవిశ్వాసంతో మాట్లాడలేక పోవడం, ఇంటర్వ్యూలలో తమ భావా లను స్పష్టంగా వ్యక్తీకరించ లేకపోవడం ద్వారా గ్రామీణ, చిన్న పట్టణాల అభ్య ర్థులు తీవ్రంగా నష్టపోతున్నారు.**



**సాఫ్ట్ స్కిల్స్ కరువు : మౌనంగా ముంచెత్తుతున్న సంక్షోభం:**

సాంకేతిక పరిజ్ఞానం ఎంత ఉన్నప్పటికీ, కమ్యూనికేషన్ స్కిల్స్, బృందంతో కలిసి పనిచేసే నైపుణ్యం, సమయానుకూల నిర్ణయాలు తీసుకునే శక్తి వంటి "సాఫ్ట్ స్కిల్స్" లేకపోవడం యువతను బాగా దెబ్బతీస్తోంది. ఇంగ్లీష్ మీడియంలో చదివినప్పటికీ ఆత్మవిశ్వాసంతో మాట్లాడలేకపోవడం, ఇంటర్వ్యూలలో తమ భావాలను స్పష్టంగా వ్యక్తీకరించలేకపోవడం ద్వారా గ్రామీణ, చిన్న పట్టణాల అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారు.అయితే, టైర్-2, టైర్-3 నగరాలైన లక్నో, కొచ్చి, చండీగఢ్ వంటి ప్రాంతాలు నేడు బలమైన నైపుణ్య కేంద్రాలుగా ఎదుగుతుండటం కొంత ఊరటనిచ్చే పరిణామం. చిన్న పట్టణాల యువత క్రమంగా రేసులోకి వస్తున్నప్పటికీ, సాధించాల్సింది ఇంకా ఎంతో ఉంది.

**దిద్దుబాటు చర్యలే పరిష్కారం:**

ఈ సంక్షోభానికి ఏ ఒక్కరినో నిందించడం వల్ల ప్రయోజనం లేదు. విద్యార్థులు, విద్యా సంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వాలు సమష్టిగా స్పందించాల్సిన తరుణమిది.కరికులం మార్పు తో విద్యా ప్రణాళికను ప్రతి రెండు, మూడేళ్లకోసారి పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా మార్చాలి.ప్రాక్టికల్ ప్రాధాన్యం ముఖ్యం కేవలం థియరీకే పరిమితం కాకుండా, కనీసం ఆరు నెలల పాటు తప్పనిసరి కార్పొరేట్ ఇంటర్న్‌షిప్‌లను అమలు చేయాలి. ఫ్యాకల్టీ ట్రైనింగ్, బోధకులకు కూడా సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులపై ఎప్పటికప్పుడు నిరంతర శిక్షణ ఇవ్వాలి. సంస్థల బాధ్యతగా కంపెనీలు కూడా కేవలం సిద్ధంగా ఉన్న అభ్యర్థుల కోసమే చూడకుండా, శిక్షణ ఇచ్చేందుకు ముందుకు రావాలి.చివరిగా గుర్తుంచుకోవాల్సిన సత్యం భారతదేశపు అతిపెద్ద బలం దాని యువశక్తి. అయితే, ఆ శక్తికి నైపుణ్యాల పదును పెట్టకపోతే, మనకు లభించిన జనాభా అనుకూలత రాబోయే రోజుల్లో దేశానికి పెద్ద భారం గా మారే ప్రమాదముంది. డిగ్రీ పట్టా అనేది జీవిత ప్రయాణానికి ఒక ఆరంభం మాత్రమే కావాలి తప్ప, అదే అంతిమ గమ్యం కాకూడదు!

# కేంద్ర వైఖరిపై ఎదురొడ్డి నిలిచిన ఉద్యమం



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496

దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో జరిగిన అక్రమాలు, ప్రశ్నాపత్రాల లీకులు, ఉద్యోగ నియామకాలలో పారదర్శకత లేకపోవడం, విద్యార్థుల ఆత్మహత్యలు, నిరుద్యోగ యువతలో పెరుగుతున్న ఆవేదన వంటి పరిణామాల నేపథ్యంలో అభిజీత్ దిప్కే నాయకత్వంలో "కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)" అనే యువజన ఉద్యమం ఆవిర్భవించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యల నేపథ్యంలో అవమానకరంగా వినిపించిన "కాక్రోచ్" అనే పదాన్నే ఉద్యమానికి గుర్తింపుగా స్వీకరించి, దానిని నిరసనకు చిహ్నంగా మార్చిన ఈ యువత, విద్యా వ్యవస్థలో జవాబుదారీ తనం, పరీక్షల పారదర్శకత, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, జాతీయ పరీక్షా వ్యవస్థలో సమూల సంస్కరణలు వంటి ప్రధాన డిమాండ్లతో జంతర్ మంతర్‌లో ఉద్యమాన్ని ప్రారంభించింది.

ఉద్యమం మొదట కొద్దిమంది విద్యార్థులతో ప్రారంభమైనా, కొద్ది రోజుల్లోనే అది దేశవ్యాప్తంగా యువత, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పౌరసమాజ సంస్థలు, రైతు సంఘాలు, విద్యావేత్తల మద్దతు పొందింది. లడఖ్‌కు చెందిన పర్యావరణవేత్త, విద్యావేత్త సోనం వాంగ్‌చుక్ జూన్ చివర్లో జంతర్‌మంతర్‌కు చేరుకొని నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించడం ఉద్యమానికి నైతిక బలాన్ని ఇచ్చింది. "ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసన మాత్రమే మిగిలిన మార్గం" అని ఆయన ప్రకటించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణించినప్పటికీ ఆయన 21 రోజుల నిరాహారదీక్షను విరమించకపోవడంతో ఢిల్లీ పోలీసులు ఆయనను బలవంతంగా ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఆయన కుటుంబ సభ్యులు, ముఖ్యంగా భార్య, వైద్య నిర్ణయం తమ సమ్మతి లేకుండా తీసుకున్నారని అభ్యంతరం వ్యక్తం చేసినట్లు పలు వార్తా కథనాలు పేర్కొన్నాయి. అనంతరం ఆవేదనతో తక్షణం అభిజీత్ దిప్కే కూడా నిరాహార దీక్ష ప్రారంభించి, తరువాత వాంగ్‌చుక్ విజ్ఞప్తితో దీక్ష విరమించి ఉద్యమానికి నాయకత్వం వహించారు.

ఈ ఉద్యమానికి సినిమా రంగం నుంచి సోనూ సూద్, ప్రకాశ్ రాజ్,షబ్నాహజ్మీ, దియా మీర్జా, వీర్ దాస్, రితేష్ దేశ్‌ముఖ్, జెనీలియా దేశ్‌ముఖ్, సోహా అలీ ఖాన్, అదితి రావు హైదరి, రోహిత్ సరాఫ్ తదితరులు సంఘీభావం తెలిపారు. సోషల్ మీడియా ప్రభావశీలులు, కళాకారులు, విద్యావేత్తలు కూడా మద్దతు ప్రకటించారు.

రాజకీయంగా ఆమ్ ఆద్మీ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ, శివసేన (ఉద్ధవ్), తృణమూల్ కాంగ్రెస్, సీపీఐ, సీపీఐ(ఎంఎల్), ఆర్జేడీ వంటి పలు ప్రతిపక్ష పార్టీలు ఉద్యమానికి బహిరంగ మద్దతు ప్రకటించాయి. మనీష్ సిసోడియా, చంద్రశేఖర్ ఆజాద్, మహువా మొయిత్రా, కీర్తి ఆజాద్ తదితరులు జంతర్‌మంతర్‌కు వెళ్లి సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ అధికారికంగా ప్రారంభంలో దూరంగా ఉన్నప్పటికీ, తరువాత రాహుల్ గాంధీ సహా పలువురు నాయకులు కూడా ఈ ఉద్యమానికి మద్దతుగా నిలిచారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా "సంసద్ చలో" పిలుపునిచ్చిన ఉద్యమకారులను పోలీసులు అనేక ప్రాంతాల్లో అడ్డుకున్నారు. ఢిల్లీ పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి, పలుచోట్ల లాఠీ చార్జి, బాష్పవాయువు ప్రయోగించినట్లు, వందలాది మందిని బలవంతంగా ఈడ్చుకుంటూ పోలీసు వాహనాల్లోకి ఎక్కించినట్లు దేశీయ, అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ఘటనల్లో సుమారు 170--180 మంది గాయపడినట్లు నివేదికలు పేర్కొన్నాయి. మరోవైపు పోలీసులు రాళ్లదాడి ఆరోపణలు చేయగా, ఉద్యమకారులు వాటిని ఖండిస్తూ పోలీసులే అధిక బలప్రయోగం చేశారని, పోలీసులు ఏర్పాటు చేసిన రాళ్ళతో నిండిన ట్రక్కులు, దెబ్బతిన్న పాత వాహనాలను అక్కడ ఉంచి ఆందోళనకారుల వల్ల హింస జరిగింది అని పోలీసులు ఆరోపణలు చేయటానికి పోలీసులే ఇలాంటి చీప్ ట్రిక్స్ ప్లే చేశారని వీడియో సాక్షాల ఆధారంగా ఉద్యమకారులు రుజువు చేశారు. ఉద్యమకారులు పోలీసులు చేసిన ప్రతి అరాచకాన్ని,హింసను, లాఠీచార్జి, భాష్ప వాయిదాలు ప్రయోగం ఇలా ప్రతి దృశ్యాన్ని వేలాది సెల్ ఫోన్ల ద్వారా ఉద్యమకారులు ప్రతి చిన్న సంఘటనను వీడియోల్లో రికార్డు చేసి పోలీసుల అసత్య, కల్పిత కథనాలను ప్రపంచానికి చాటారు. ఒక వైపు ఉద్యమ ప్రతినిధులతో కేంద్ర మంత్రి జె.పి. నడ్డా చర్చలు జరిపి వినతి పత్రం స్వీకరించినప్పటికీ, ఉద్యమం ప్రధానంగా కోరిన హామీలపై స్పష్టమైన నిర్ణయం వెలువడలేదని ఉద్యమ నాయకులు ప్రకటించారు. అందువల్ల ఉద్యమం కొనసాగుతుందని వారు వెల్లడించారు. పార్లమెంట్‌లో ఈ అంశంపై ప్రత్యేక చర్చ జరపాలని ప్రతిపక్షాలు పదేపదే డిమాండ్ చేశాయి. అయితే ప్రభుత్వం ఆ



డిమాండ్‌ను అంగీకరించలేదని, అధికార పక్షం నుంచి సమగ్ర ప్రకటన రాలేదని ప్రతి పక్షాలు విమర్శించాయి. అనంతరం కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ నేతృత్వంలో ప్రధాన మంత్రి నివా సం వైపు నిరసనకు ప్రయత్నించగా, వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని తరువాత విడుదల చేశారు. ఈ పరిణా మాలు ఉద్యమానికి మరింత రాజకీయ ప్రాధాన్యం తీసుకువచ్చాయి.ఈ మొత్తం పరిణామాలపై అంతర్జాతీయ మీడియా కూడా ప్రత్యేక దృష్టి సారించింది. రాయిటర్స్, అసోసియేటెడ్ ప్రెస్, ది గార్డియన్ వంటి సంస్థలు ఈ ఉద్యమాన్ని కేవలం పరీక్షల అంశంగా కాకుండా, నిరుద్యోగం, విద్యా వ్యవస్థపై నమ్మకం కోల్పోవడం, ప్రజాస్వామ్య హక్కులు, యువత ఆవేదనకు ప్రతీకగా విశ్లేషించాయి. శాంతియుత నిరసనకారులపై బలప్రయోగం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అంతర్జాతీయ మానవ హక్కు ల సంస్థ అమ్నెస్టీ ఇంటర్నేషనల్ కూడా విమర్శించినట్లు వార్తా కథనాలు పేర్కొ న్నాయి.ఈ పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వ వైఖరిపై తీవ్రమైన రాజకీయ విమర్శలు వెల్లువెత్తాయి. విమర్శకుల అభిప్రాయం ప్రకారం, శాంతియుతంగా తమ సమస్యలను వినిపిస్తున్న యువతతో నిర్మాణాత్మక సంభాషణ జరపడం కంటే, చట్ట వ్యవస్థ పేరుతో ఉద్యమాన్ని అణచివేయడమే ప్రభుత్వ ప్రాధాన్యంగా కనిపించిందని ఆరోపిస్తున్నారు. అదే సమయంలో ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని విమర్శలు ఎదుర్కొంటున్న కొన్ని (గోదీ మీడియా) టెలివిజన్ ఛానళ్లు ఉద్యమ ప్రధాన డిమాండ్ల కంటే రాజకీయ కోణానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాయని ప్రత్యర్థులు వ్యాఖ్యానించారు. మరోవైపు, స్వతంత్ర డిజిటల్ మీడియా, అంతర్జాతీయ మీడియా మాత్రం విద్యార్థుల డిమాండ్లు, పోలీసు చర్యలు, ప్రజాస్వామ్య హక్కుల కోణాలను విస్తృతంగా ప్రస్తావించాయి.ఏ ప్రజాస్వామ్యంలోనైనా ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు పౌరులకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక స్వేచ్ఛ. ఆ హక్కును వినియోగిస్తున్న యువతతో సంభాషణ జరపడం, వారి డిమాండ్లను పారదర్శకం గా పరిశీలించడం, బాధ్యులపై చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత. నిరసన లపై బలప్రయోగం, రాజకీయ ఘర్షణలు తాత్కాలికంగా ఉద్యమాలను అణచివేయ వచ్చేమోగానీ, అసలు సమస్యలను పరిష్కరించలేవు. జంతర్‌మంతర్‌లో ప్రారంభమైన ఈ ఉద్యమం చివరికి భారత యువతలో పెరుగుతున్న అసంతృప్తికి, జవాబుదారీతనం కోరుతున్న కొత్త తరం ఆకాంక్షలకు ప్రతీకగా నిలిచిందనేది ఈ పరిణామాల ప్రధాన సందేశం. భవి ష్యత్తులో జరగబోయే ఎన్నికల్లో ఈ ఉద్యమ ప్రభావం తీవ్రంగా ఉంటుందని , అధికార పార్టీకి ఒక హెచ్చరికగా ఈ ప్రభుత్వ హింసాయుత, అణచివేత ధోరణి ఒక గుణపాఠం నేర్పేలా చేస్తుందని రాజ కీయ విశ్లేషకులు, సాధారణ ప్రజలు భావిస్తున్నారు..

**ఉద్యమకారులు పోలీసులు చేసిన ప్రతి అరాచకాన్ని,హింసను, లాఠీచార్జి, భాష్ప వాయిదాలు ప్రయోగం ఇలా ప్రతి దృశ్యాన్ని వేలాది సెల్ ఫోన్ల ద్వారా ఉద్య మకారులు ప్రతి చిన్న సంఘటనను వీడియోల్లో రికార్డు చేసి పోలీసుల అసత్య, కల్పిత కథనాలను ప్రపంచానికి చాటారు. ఒక వైపు ఉద్యమ ప్రతినిధులతో కేంద్ర మంత్రి జె.పి. నడ్డా చర్చలు జరిపి వినతి పత్రం స్వీకరించినప్పటికీ, ఉద్యమం ప్రధానంగా కోరిన హామీలపై స్పష్టమైన నిర్ణయం వెలువడలేదని ఉద్యమ నాయ కులు ప్రకటించారు. అందువల్ల ఉద్యమం కొనసాగుతుందని వారు వెల్లడించారు. పార్లమెంట్‌లో ఈ అంశంపై ప్రత్యేక చర్చ జరపాలని ప్రతిపక్షాలు పదేపదే డిమాండ్ చేశాయి.**

## శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల దర్యాప్తులో

# సీసీ కెమెరాలు అత్యంత కీలకం

**సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా.ఎం. రమేష్**

**'నేను సైతం' కార్యక్రమంలో భాగంగా సీసీటీవీ కెమెరాల జియో ట్యాగింగ్‌పై సైబరాబాద్ సీపీ సమీక్ష**

**వాస్తవం : శేరిలింగంపల్లి జూలై 22:**

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 'నేను సైతం' కార్యక్రమంలో భాగంగా సీసీటీవీ కెమెరాల జియో ట్యాగింగ్, పర్యవేక్షణ, నిర్వహణ, విస్తరణపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ అధ్యక్షతన బుధవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయ ఆడిటోరియంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) డీసీపీ వై.వి.ఎస్. సుధీంద్రతో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నివారణ, నేరాల దర్యాప్తు, కీలక సమాచార సేకరణలో సీసీటీవీ కెమెరాలు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. కమిషనరేట్ పరిధిలో ఇప్పటికే ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలన్నింటినీ జియో ట్యాగింగ్ చేసి వాటి వివరాలను డిజిటల్ డేటాబేస్‌లో నమోదు చేయాలని, కొత్తగా ఏర్పాటు చేసే ప్రతి కెమెరాను కూడా వెంటనే జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో సీసీటీవీ వ్యవస్థ పర్యవేక్షణ కోసం ప్రత్యేక అడ్మిన్‌ను నియమించి, కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని సూచించారు. పనిచేయని కెమెరాలను వెంటనే మరమ్మతులు చేయించి, ఇప్పటికే ఉన్న కెమెరాలను పోలీసు పర్యవేక్షణ వ్యవస్థతో అనుసంధానం చేయాలని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో "నేను సైతం" కార్యక్రమం ద్వారా మరిన్ని సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా, చాలా చోట్ల మరుగున పడిన డీవీఆర్ ఆధారిత సీసీటీవీ వ్యవస్థలను ఆధునిక ఎన్‌వీఆర్ సాంకేతికతకు అప్‌గ్రేడ్ చేసే అంశంపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. కమిషనరేట్ వ్యాప్తంగా డీవీఆర్ వ్యవస్థలను దశల వారీగా ఎన్‌వీఆర్ విధానానికి మార్చేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన సాంకేతిక అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన, పోలీస్ స్టేషన్ల నుంచి ప్రధాన కంట్రోల్ సెంటర్ వరకు నెట్‌వర్క్ అనుసంధాన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలోని సీసీటీవీ నెట్‌వర్క్‌ను సెంట్రల్ కంట్రోల్ వ్యవస్థతో





అనుసంధానం చేయడం ద్వారా ప్రత్యక్ష పర్యవేక్షణ, వీడియో రికార్డింగ్, ఫుటేజీ నిల్వ, అవసరమైన సమయంలో ఆధారాల సేకరణ, విశ్లేషణ మరింత వేగంగా, సమర్థవంతంగా నిర్వహించవచ్చని తెలిపారు. సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసిన వెండర్లు కెమెరాల నిర్వహణ, సాంకేతిక లోపాల పరిష్కారం, సేవల నిరంతర అందుబాటుపై పూర్తి బాధ్యత వహించాలని సీపీ స్పష్టం చేశారు. జియో ట్యాగింగ్ ప్రక్రియ, సాఫ్ట్‌వేర్ వినియోగం, కెమెరాల నిర్వహణపై అధికారులు, సిబ్బంది, వెండర్లకు ప్రత్యేక శిక్షణ, ప్రాక్టికల్ సెషన్లు నిర్వహించాలని సూచించారు. సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ సీసీటీవీ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయడం ద్వారా నేరాలను అరికట్టడంతో పాటు, నేరాల దర్యాప్తు సామర్థ్యాన్ని పెంచి ప్రజలకు మరింత మెరుగైన భద్రతను అందించవచ్చని డా. ఎం. రమేష్ తెలిపారు. సీసీటీవీ కెమెరాల జియో ట్యాగింగ్, సెంట్రల్ మానిటరింగ్, డీవీఆర్ నుంచి ఎన్‌వీఆర్ వ్యవస్థకు మార్పు ద్వారా నేరాలపై మరింత సమర్థవంతమైన పర్యవేక్షణ సాధ్యమవుతుందని, తద్వారా నేరాలు గణనీయంగా తగ్గుముఖం పడతాయని ఆయన పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో నేను సైతం కార్యక్రమాన్ని మరింత విస్తరించి, నివాస గృహాలు, అపార్ట్‌మెంట్లు, వ్యాపార సంస్థలు, పరిశ్రమలు, విద్యాసంస్థల్లో నాణ్యమైన సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీసులతో అనుసంధానం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజల సహకారం, ఆధునిక సాంకేతికత కలిసి వస్తే సైబరాబాద్ కమిషనరేట్‌ను మరింత సురక్షితమైన ప్రాంతంగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని కమిషనర్ పేర్కొన్నారు.

# లాఠీలు కాంగ్రెస్‌కు కొత్త కాదు

**దేశం కోసం రక్తం చిందించిన చరిత్ర గాంధీ కుటుంబానిది**

**నీట్ పరీక్ష పేపర్ లీక్‌తో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది**

**విద్యార్థుల జీవితాలతో బీజేపీ నేతల చెలగాటం**

**ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసే వరకు పోరాటం**

**మోదీని గద్దె దించి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుందాం**


**దేశాన్ని దోచుకుంటుంటే చూస్తూ ఊరుకోం**

**తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి**





**వికారాబాద్, జులై 22:** అంబేద్కర్ అందించిన రాజ్యాంగం సాక్షిగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై కేంద్ర ప్రభుత్వ, పోలీసుల పాశవిక దాడికి ఖండిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన ధర్నా కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నీట్ పరీక్ష పేపర్ లీక్‌తో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాలను ఆ పార్టీ నాయకులు అమ్ముకుని.. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడారని మండిపడ్డారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను అరెస్టు చేసి, పేపర్ లీక్ చేసిన వాళ్లను జైల్లో పెట్టాల్సింది పోయి.. విద్యార్థులపై పాశవిక దాడి జరిపారని ఫైర్ అయ్యారు. ఆడపిల్లలపై దాడి చేశారని.. విద్యార్థుల తలలు పగలగొట్టారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పదుల సంఖ్యలో విద్యార్థులు కనిపించడంలేదని, వారిని ఎక్కడికైనా తీసుకెళ్లారా? లేక కిడ్నాప్ చేశారో తెలియదన్నారు. విద్యార్థులకు మద్దతుగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ.. ప్రధాని ఇంటి ముందు నిరసన చేపట్టారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కు అని అన్నారు. పేపర్ లీక్‌పై పార్లమెంటులో చర్చ జరగకుండా అడ్డుకున్నారని.. రాహుల్ గాంధీపై పాశవిక దాడితో ఆయన రక్తం నేలకు చిందిందన్నారు. దేశం కోసం రక్తం చిందించడం గాంధీ కుటుంబానికి కొత్త కాదని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్నా సోనియా గాంధీ ప్రధాని పదవి తీసుకోలేదని.. మంత్రి పదవి కూడా చేపట్టలేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రతిపక్ష నాయకుడిగా ఖర్గేను నియమించారు తప్ప పదవులు తీసుకోలేదని చెప్పుకొచ్చారు. 2019 ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా అవకతవకలకు పాల్పడి విద్యార్థుల ప్రాణాలు బలిగొందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణలో పప్పులు ఉడకవని పేరు మార్చుకుని గ్లోబరీనా సంస్థ కేంద్రం వద్దకు వెళ్లిందని.. అప్పుడే ఆ సంస్థపై క్రిమినల్ కేసులు పెట్టి ఉంటే ఇప్పుడు ఇలా జరిగి ఉండేది కాదన్నారు. నీట్ పరీక్ష నిర్వహించడంతో దొంగతనం చేయొచ్చన్న ధైర్యం వాళ్లకు వచ్చిందని విమర్శించారు. జదీూజులో జరిగిన అక్రమాలు, నీట్ పరీక్ష పేపర్ లీకేజ్‌పై విద్యార్థులు నిరసన తెలిపారన్నారు. లాఠీలు కాంగ్రెస్‌కు కొత్త కాదని.. ఆంగ్లేయులతో పోరాడి తరిమికొట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. దేశాన్ని దోచుకుంటుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. యువత పక్షాన నిలిచి మోదీపై పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అందరం కలిసి పోరాటం చేసి మోదీని గద్దె దించి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుందామని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.




**ఢిల్లీ:** గత 10 ఏళ్లల్లో 152 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒక్క కేసులో కూడా దోషులు ఎవరో తేలలేదని అన్నారు. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై ఉద్యమిస్తున్న యువతకు మద్దతుగా రాహుల్ గాంధీ బుధవారం ఏర్పాటు చేసిన పత్రికాసమావేశంలో కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో విద్యా వ్యవస్థ మొత్తం రిగ్గింగ్ బారిన పడిందని ఆరోపించారు. విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పనితీరు అసమర్థంగా, అవినీతిమయంగా ఉందని ఆరోపించారు. ఆయన రాజీనామా చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఆయన రాజీనామాకు విద్యార్థులు పట్టుబడుతున్నారని, ఇది సరైన డిమాండేనని వ్యాఖ్యానించారు. ఈ దుస్థితికి ప్రతిబింబంగా మారిన ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకోవాల్సిందేనని తేల్చి చెప్పారు. 'గత పదేళ్లలో సుమారు 152 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయి. అంటే.. సగటున వారానికి ఒక పేపర్ లీక్ జరిగింది. కోట్ల మంది విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడింది. కానీ ఒక్క కేసులో కూడా దోషులెవరో తేలలేదు. ఇలా ఎందుకు జరిగిందని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఒకప్పుడు దేశానికి సంపదగా ఉన్న విద్యారంగం ఎన్డీయే పాలనలో ధ్వంసమైందని రాహుల్ గాంధీ ఆరోపించారు. పేద, మధ్యతరగతి వర్గాలకు విద్య భారంగా మారిందని చెప్పారు. కోచింగ్‌పై నీట్ అభ్యర్థుల వార్షిక ఖర్చు రూ.1.32 లక్షల కోట్లని అన్నారు. ఇది విద్యారంగం వార్షిక బడ్జెట్ రూ.1.42 లక్షల కోట్లకు దాదాపు సమానమని వ్యాఖ్యానించారు. సంపన్నుల కోసమే ఉద్దేశించిన ఈ వ్యవస్థలో పేదలకు స్థానం లేదని అన్నారు. సోమవారం నిరసనల సందర్భంగా విద్యార్థులపై లాఠీచార్జ్ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రధాని మోదీ విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సిందేనని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 54 మందికి ఉచిత కంటి ఆపరేషన్స్ విజయవంతం



**వాస్తవం : చెన్నూర్ ఆర్సీ**

తేది.20.07.2026 సోమవారం నాడు చెన్నూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని రేకుర్తి ఉదార నేత్ర వైద్యశాల వారి సౌజన్యంతో, వైస్ చైర్మన్ చిదుర సురేష్ సహకారంతో మైనారిటీ ఫంక్షన్ హాల్ లో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించిన విషయం తెలిసిందే. విజయవంతమైన కంటి ఆపరేషన్స్ తో 54 మంది నేడు చెన్నూర్ కు తిరిగి వచ్చారని చెన్నూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిమ్మల సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కంటి ఆపరేషన్స్ అయిన వారి క్షేమ సమాచారం తెలుసుకున్నారు. వారికి కంటికి తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేసి రేకుర్తి డాక్టర్లు చెప్పిన విధంగా చుక్కల మందులు వాడాలని, తేది.27.07.2026 సోమవారం నాడు తప్పకుండా రేకుర్తి కంటి ఆసుపత్రికి వెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా ఐ పేషంట్లకు బ్రెడ్ పంపిణి చేశారు. ఐ పేషంట్లు ఆనందంతో మాట్లాడుతూ మా లాంటి నిరుపేదలకు ఇంత గొప్ప సేవ సేవ చేస్తూన్న రేకుర్తి కంటి ఆసుపత్రి యాజమాన్యానికి, డాక్టర్లకు మరియు చెన్నూర్ లయన్స్ క్లబ్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్ ఛైర్పర్సన్ జాడి తిరుపతి, క్లబ్ కోశాధికారి సౌడం శ్రీనివాస్, సభ్యులు జక్కుల సత్య నారాయణ,ఎన్నాం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## అదనపు ధాన్యం కొనుగోలుకు కేంద్రం ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేసింది. 2026 సెప్టెంబర్ 30 నాటికి రాష్ట్రం లోని అన్ని అర్హత గల వాహనాల్లో వీఎల్టీఎస్ వ్యవస్థను పూర్తిగా అమలు చేయాలని కేంద్రం స్పష్టం చేసింది. ఈ వ్యవస్థ ద్వారా వాహనాల కదలికలను రియల్ టైమ్‌లో పర్యవేక్షించే అవకాశం ఉండటంతో భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపడనున్నాయి. ఈ అంశాలపై పార్లమెంట్‌లో కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కలిశారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వడ్ల కొనుగోలు అంచనాను పెంచినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యానికి సరైన మద్దతు ధరతో కొనుగోలు జరిగేలా కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం వ్యవసాయ రంగానికి ఊతమివ్వనుంది. అదనపు కొనుగోళ్లతో రైతులకు ఆర్థిక భరోసా పెరగడంతో పాటు రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ మరింత సాఫీగా సాగేందుకు అవకాశం ఏర్పడింది.

## సింగరేణి-ఎస్టిపిపి ఆధ్వర్యంలో ఇందారంలో వైద్యశిబిరం

**వాస్తవం , జైపూర్, జూలై 22**

సింగరేణి యాజమాన్యం సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఆధ్వర్యంలో జైపూర్ మండలంలోని ఇందారం గ్రామంలో గల గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈడి సిహెచ్. చిరంజీవి సింగరేణి ఉన్నతాధికారుల సూచన మేరకు ప్లాంట్ ప్రభావిత గ్రామాల ప్రజల ఆరోగ్య ప్రయోజనాల కోసం ఈ ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందని, దీని ద్వారా గ్రామ ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకొని, తద్వారా ముందస్తుగా వ్యాధి నివారణ చర్యలు చేపట్టవచ్చని అన్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరు ఈ వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ వైద్యశిబిరంలో 57 మంది మహిళలు, వృద్ధులు, రోగులు వైద్యపరీక్షలు చేయించుకున్నారని, వారికి తగు విధంగా మందులు పంపిణి చేశామని తెలిపారు.



Publisher, Editor and Owned by Manasani Krishna Reddy, H No 4-81/1, Ramagundam, Elkalpalli, Karimnagar, Telangana - 505208.
KARIMNAGAR, TELANGANA -505001. Editor : MANASANI KRISHNA REDDY

# ఏ ఒక్కరి ఓటు కోల్పోకుండా జాగ్రత్తలు చేపట్టాలి

### వికలాంగుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ముత్తినేని



**వాస్తవం : పాలకవీడు**

ఓటరు జాబితాలో ఉన్న ఏ ఒక్కరి ఓటు కోల్పోకుండా జాగ్రత్తలు చేపట్టాలని రాష్ట్ర వికలాంగుల కమిషన్ చైర్మన్, సర్ ప్రోగ్రాం హుజూర్ నగర్ నియోజకవర్గ ఇన్చార్జి ముత్తినేని వీరయ్య సూచించారు.సర్ ప్రోగ్రాం కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మాలోత్ మోతిలాల్ నాయక్ నేతృత్వంలో బుధవారం పాలకవీడు మండలంలోని కల్మెట తండా, రావిపాడు, జాన్ పహాడ్, మహంకాళి గూడెం తదితర గ్రామాలలో ఎన్యుమరేషన్ ఫారాల తిరిగి సేకరణ, డిజిటలైజేషన్ కార్యక్రమాలపై బిఎల్వోల తో మాట్లాడి ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు. రాష్ట్ర భారీ నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల ప్రకారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉంటూ ఎన్యుమరేషన్ కార్యక్రమంలో విస్తృతంగా పాల్గొనాలని కోరారు. అవగాహన లేని ఓటర్లను చైతన్యపరుస్తూ ఇంటింటికి పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను నింపి బిఎల్ఓ లకు తిరిగి అందించేందుకు సహాయపడాలన్నారు.లేనిచో అర్హులైన ఓటర్ సైతం ఓటు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఆగస్టు 3 లోగా డిజిటలైజేషన్ కార్యక్రమం పూర్తయ్యేంత వరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు.ఆయన వెంట శూన్యపాడ్, మహంకాళి గూడెం,రావిపాడు,కల్మట తండా గ్రామాల సర్పంచులు నీమానాయక్ పిడమర్తి దాసు,సుశీల ఏసు,చరణ్ నాయక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శోభన్,పిడమర్తి ప్రేమ్ కుమార్, దావీదు , రాము సైదా వీరన్న తదితరులున్నారు.

# విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



**వాస్తవం : పాలకవీడు**

విద్యుత్ షాక్‌తో నాగిరెడ్డి గూడెం గ్రామ వాసి మల్గిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మృతి చెందడం జరిగింది స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎన్ఎస్పి కాలువ లైనింగ్ పనులలో మల్గిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తండ్రి జానకిరామ్ రెడ్డి వయస్సు 45 సంవత్సరాలు అను వ్యక్తి గత 4 రోజులకు ముందు కాలువ లైనింగ్ పనులలో డ్రైవర్ గా చేరి కాలువ పనులలో చేస్తున్నాడు,ఈ క్రమంలో బుధవారం రోజు జనరేటర్ బాక్స్‌ను అక్కడ నుండి వేరొక చోటకు మార్చుతున్న సమయంలో పైన విధ్యుత్ మెయిన్ లైన్ టచ్ అయి ఉండటాన్ని గమనించక విద్యుత్ షాక్ గురై అక్కడే మృతి చెందాడని స్థానికులు తెలిపారు.

# రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ మహాధర్నా

### శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై

### విచక్షణ రహితంగా వ్యవహరించడం నిరంకుశత్వం

### ముఖ్య నేతల అరెస్టుకు నిరసనగా హుస్నాబాద్‌లో

### మంత్రి పొన్నం ప్రభాకర్ మహాధర్నా





**వాస్తవం : హుస్నాబాద్**

జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై లాఠీచార్జిని నిరసిస్తూ లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, ఎంపీలు చేపడుతున్న శాంతియుత నిరసన కార్యక్రమంలో నిరంకుషత్వంగా వ్యవహరిస్తూ అరెస్టు చేయడాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ఖండించారు. హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇక్కడ జరిగిన మహాధర్నా కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. నిరసనకు చిహ్నామైన నలుపు టవల్ ధరించి నీట్ పేపర్ లీకేజీకి కారణమైన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని దీనిపై హోం మంత్రి స్పందించాలని అన్నారు. అలాగే నీట్ పేపర్ లీక్ తో ఆత్మహత్యకు పాల్పడ్డ విద్యార్థుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.లీకేజీ ఘటనలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు.విద్యార్థుల లాఠీఛార్జ్ పై హోంమంత్రి సంఘీభావం తెలుపకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.లాఠీ చార్జ్జికి బాధ్యులైన వారిని సస్పెండ్ చేయాలని, గాయపడ్డ వారికి మంచి వైద్యం అందించాలన్నారు. రాహుల్ గాంధీతో సహా వందమంది ఎంపీలు ధర్నా చేస్తుంటే వారిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

### జోగిపేట ఉన్ని సంఘం చైర్మన్‌గా

# ఆర్ కిష్టయ్య

**వాస్తవం : ఆందోల్**



జోగిపేట ఉన్ని సంఘం చైర్మన్ డాకూర్‌కు చెందిన ఆర్ కిష్టయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘంలో పది మంది డైరెక్టర్ల గాను ఇద్దరు మహిళలు ఎక గ్రీవం కాగా ఏడు మంది డైరెక్టర్లకు ఎన్నికలు జరిగాయి. ఇందులో గెలుపొందిన డైరె క్టర్లు డాకూర్‌కు చెందిన ఆర్ కిష్టయ్యను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు.అధ్యక్షునితోపాటు ఉపాధ్యక్షులుగా సంగమేశ్వర్,ప్రధాన కార్యదర్శిగా జెనర్సింలు, జి నారాయణ కోశాధికారిగా,డైరెక్టర్లుగా పి సత్యనారాయణ, డి నరసింహులు,బి సాయిలు,డి పెంటమ్మ,ఆర్ బుజ్జమ్మలను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా అధ్యక్షులు కృష్ణయ్య మాట్లాడుతూ సంఘం అభివృద్ధి కో సం పాటుపడతామని పేర్కొన్నారు.ఓట్లు వేసి గెలిపించిన ప్రతి కురుమ బంధువులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పరం గా వచ్చే స్కీములను అభివృద్ధి పదంలో నడి పిస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఎన్నికల అధికారి నిర్మల రాజకుమారి వారికి గెలుపు పత్రాలను అం దజేశారు.

# భూమి అక్రమ నమోదు వార్త అవాస్తవం

### కొనుగోలు చేసి కస్తూ చేసుకునేది వసంత్

### భూమి సంబంధిత కాగితాలు, రెవెన్యూ రికార్డులో ఉన్నాం

### నిరక్షరాస్యత లోపం వలన పట్టాలో పేరు మార్పు చేసుకోలేదు

**వాస్తవం : వీర్నపల్లి**

తమ భూమి అక్రమంగా రెవెన్యూ రికార్డులో పేరు మార్చారు అని జులై 7 వచ్చిన వార్త ఆవాస్తవమని బాధిత గంగాధరి వసంత్ కుటుంబ సభ్యులు తెలిపారు.1968లో సాదా బైనమా ద్వారా కొనుగోలు చేసి రెవెన్యూ రికార్డులో పేరు నమోదు కాబడి,అప్పటినుండి ఇప్పటివరకు కాస్తు కబ్జా కలిగి వివిధ పంటలు సాగు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నామని,నిరక్షరాస్యత మరియు రెవెన్యూ రికార్డు వ్యవస్థ పై అవగాహన లోపం వలన పట్టాదారుకాలం లో పేరు మార్పిడి చేసుకోలేదని,దీని ఆసరాగా చేసుకున్నటువంటి కంఠం రవి తన కుమారుడైనటువంటి సతీష్ మాపైన సిరిసిల్ల జిల్లా ప్రెస్ క్లబ్ వేదికగా చేసినటువంటి నిరాధారమైన ఆరోపణలు అవాస్తవం అని, మాలాంటి భూసమస్య లాంటివి రాష్టం లో 9లక్షలకు పైగా ఉన్నాయి అని, ఇలాంటి సదాబైనామా సమస్యలకు భూభారతి ద్వారా పరిస్కారం దొరుకుతుంది అని జీర్ణించుకొక కొంత మంది ప్రొద్భలంతో,లేనిపోనీ ఆరోపణలు చేస్తున్నాడు అని తెలి పారు.అలాంటి విషయాలకి భయపడే ప్రసక్తే లేదని హెచ్చరించారు. తెలంగాణ ప్రభుత్వ భూభారతి జి.ఓ ప్రకారం కస్తూ చేయుచు,పట్టాకు కావలసినటువంటి భూమి ఆధారాలు పక్కాగా సమర్పిస్తామని, ఇట్టి విషయంలో సంబంధిత వీర్నపల్లి తహసీల్దార్ కార్యాలయము గారికి,గౌరవ జిల్లా కలెక్టర్ కు జిల్లా రెవెన్యూ ఆఫీసర్, ఆర్. డి. ఓ కి కలిసి భూమికి సంబంధిత కాగితాలు గంగాధరి వసంత్, పసుల నర్సయ్య, పసుల పోచయ్య కుటుంబ సభ్యులు అందరం కలిసి సమర్పిస్తామని తెలిపారు.మండల రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై మేము మోసం చేస్తున్నామని కమటం రవి కుమారుడు కంఠం సతీష్ ఆరోపించడాము సరిఅయిన పద్ధతి కాదాని ఇట్టి విషయం నిర్ధారించకుంటే చట్ట పరమైన పిర్యాదు చేస్తా మని తెలిపారు.తహసీల్దార్ కార్యాలయంలో సాదాబైనమలో అప్లికేషన్ మాత్రమే పెట్టుకున్నామని తెలిపారు.భూభారతిలో చట్టస వరణ చేసినటువంటి చట్టాన్ని అనుసరించి గత 40 సంవత్సరాలు కస్తూలో ఉన్నటువంటి మా భూమి ని పట్టా చేయాలని తహసీల్దార్ కి వినతిపత్రం సమర్పించడం జరిగిందని తెలిపారు. 61/ఇ సర్వే నెంబర్లో కస్తూ చేసే మా భూమిలోకి అన్యాయంగా వచ్చి మాపై దాడికి ప్రయత్నం చేస్తూ, రెవెన్యూ వ్యవస్థ పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాడని అన్నారు. 61 ఇ సర్వే నెంబర్లో గత 40 సంవత్సరాలు కస్తు చేస్తూ జీవనం కొనసాగిస్తునమాని తెలిపారు.ధరణి చట్టంలో పట్టాదారు కంటము రవి నమోదు కాబడి, కబ్జా కాస్తు కాలం తీసివేయడం ద్వారా గంగాధరి వసంత్ పేరు తొలగించబడడాన్ని ఆసరాగా తీసుకున్నటువంటి కంఠం రవి కుమారుడైన కంఠం సతీష్ భూమి కాస్తు చేస్తున్నటువంటి మాపై దౌర్జన్యానికి దిగుతూ మాపైన అసత్య ఆరోపణలు చేస్తూ కలెక్టర్‌కి తప్పుడు సమాచారం ఇస్తున్నాడు అని ఆరోపించారు. ఇకనైనా తప్పుడు ప్రచారాలు మానుతూ రెవిన్యూ వ్యవస్థ పైన, మా కుటుంబ సభ్యుల పైన తప్పుడు ఆరోపణలు చేయటం ఆపాలని హెచ్చరించారు. కస్తూ మోకా పంట నష్టం చేసే ప్రయత్నం చేసినప్పటికి ఊరుకున్నాము అని ఇంకోసారి మళ్ళీ అలాంటి ప్రయత్నం చేస్తే చట్టపరమైనచర్యలు తప్పవని హెచ్చరించారు.






# పత్రికల గౌరవం నిలిచేది

# వార్తల ప్రాధాన్యతను గుర్తించడంలోనే

**ఏది ప్రాధాన్యత కల అంశం అనేది తెలియాలి?**

........................................

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎంఎల్ఎ : **వార్త (న్యూస్)**

తల్లిదండ్రులు చనిపోవడంతో అనాథలుగా మారిన చిన్నారులు : **కథనం(స్టోరీ)**

ఈ రెండింటిలో ఒకటి వార్త, రెండోది కథనం. ఈ రెండింటిలో దేనికి ప్రాధాన్యం అంటే అనాథలుగా మారిన చిన్నారులు అనే కథనానికే మొదటి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. ఎందుకంటే అభివృద్ధి పనులను శాసనసభ్యుడు ప్రారంభించడం సాధారణమే. కానీ ఓ ప్రమాదంలోనో, వ్యాధులతోనో మరే ఇతరత్రా కారణాలతో తల్లిదండ్రులు చనిపోతే వారి సంతానం అనాథలవుతారు.వారి ఆలనాపాలన అగమ్యగోచరంగా ఉంటుంది. వీరిపై రాసిన కథనం మానవీయ కోణంలో పాఠకులను కన్నీళ్లు పెట్టిస్తుంది. ముఖ్యంగా వార్త ప్రచురణతో అటు ప్రభుత్వం ఇటు దాతలు ఆ చిన్నారులను ఆదుకునే అవకాశం ఉంటుంది. అంటే మన వార్తలతో కొందరి జీవితాల్లో వెలుగు నింపొచ్చన్నమాట. అందుకే ఈ కథనానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి.

**మరో ఉదాహరణ**

వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు : **వార్త (న్యూస్)**

గిట్టుబాటు ధర లేక పండించిన పంటను రోడ్డుపైన పారబోసిన రైతులు : **వార్త (న్యూస్)**

ఈ రెండూ వార్తలే. వీటిలో దేనికి ప్రాధాన్యత అంటే ఖచ్చితంగా రెండో వార్తనే ప్రాధాన్యతగల వార్తగా పరిగణించాలి. వాహనాలను తనిఖీ చేయడం ట్రాఫిక్ పోలీసుల విధి. ఆ బాధ్యతను వారు నెరవేర్చడం సహజం. ఇక రెండోది ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో పంటను రోడ్ల మీద పారబోసి రైతులు నిరసన తెలపడం అనేది అత్యంత ప్రాధాన్యత కల అంశం. ఈ అంశం అధికారులకు, ప్రభుత్వానికి చురకపెట్టే అంశం. పండిన పంటకు గిట్టుబాటు ధర లేకపోతే చేసిన అప్పులు తీరక రైతు ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉన్నది. కనీసం ఈ వార్తను ప్రచురించే సందర్భంలో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు పూనుకుని రైతులకు మేలు చేసే అవకాశం ఉంటుంది.

**మరో ఉదాహరణ**

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు : వార్త

వైద్య సేవలందిస్తున్న ప్రభుత్వాసుపత్రి వైద్యుడు : వార్త

శాంతి భద్రతలు కాపాడుతున్న పోలీసులు : కథనం

పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయాధికారి : వార్త

రోడ్లను శుభ్రం చేసిన పారిశుద్ధ్య కార్మికులు: వార్త

రాజన్నను దర్శించుకున్న ఎస్ఐ: వార్త

వికలాంగుడి పింఛన్ కోసం ఎంఆర్ఒకి ఫోన్ చేసిన ఎంఎల్ఎ:వార్త

కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన సర్పంచ్: వార్త

పంట కాల్వకు సాగు నీటి సరఫరాని నిలిపేసిన అధికారులు: వార్త

వీటన్నింటిలో ఏ వార్తకు ప్రాధాన్యత ఇవ్వాలనే అంశం కొద్దిగా కఠినంగానే ఉంటుంది. కానీ 'పంట కాల్వకు నిటి సరఫరాను నిలిపేసిన అధికారులు' అనే వార్తకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. ఎందుకంటే పంట కాల్వ మీద ఆధారపడి వేలాది ఎకరాల్లో పంట సాగవుతూ ఉంటుంది.నీటి సరఫరా నిలిపివేస్తే పంటలకు నీళ్లందక వేలాది ఎకరాలు ఎండిపోయే ప్రమాదం ఉంటుంది. కొన్ని సార్లు మరమ్మతుల కారణంతోనో ఇతరత్రా కారణాలతోనో కాల్వకు నీటిని విడుదల చేయడంలో అధికారులు అలసత్వాన్ని చూపెడుతుంటారు. రైతుల బాధలు అర్థం చేసుకోక విధుల్లో నిర్లక్ష్యం వహిస్తుంటారు.ఇలాంటి సందర్భాల్లో ఈ వార్తకు ప్రాధాన్యత ఇవ్వడం సమయోచితం.

**మరో ఉదాహరణ**

ఎయిడ్స్‌కు మందు కనుగొన్నారు : వార్త

ఎటిఎంలలో నగదు కొరత : వార్త

నేటి నుంచి పది పరీక్షలు: వార్త

ఇవన్నీ ప్రాధాన్యత కల వార్తలే. వీటిలో దేనికి మొదటి ప్రాధాన్యత అంటే 'ఎయిడ్స్‌కు మందు కనుక్కోవడమే' మొదటి ప్రాధాన్యత కల అంశంగా ఉంటుంది. ఎందుకంటే ఇప్పటివరకూ ఎయిడ్స్‌కు మందు లేదు.ఈ మహమ్మారి బారిన పడి ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది మృత్యువాత పడుతున్నారు. ఇక ఎటిఎంలలో నగదు కొరతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు అనే అంశం కూడా ప్రాధాన్యత కల అంశమే. కానీ ఈ సమస్య తరచూ తలెత్తేదే. ఇక పది పరీక్షలు అనేది సంవత్సరానికి ఒకసారి వచ్చే ప్రాధాన్యత కల అంశం. లక్షలాది విద్యార్థులు ఈ పరీక్షకు ప్రతి యేడు హాజరవుతుంటారు.

**మరో ఉదాహరణ:**

వరల్డ్ కప్ క్రికెట్ ఫైనల్లో భారత్ : వార్త (న్యూస్)




జీవశాస్త్రంలో భారతశాస్త్రవేత్తకు నోబెల్ బహుమతి: వార్త

భారత సంగీత దర్శకుడికి ఆస్కార్ అవార్డ్: వార్త ( న్యూస్)

ఈ మూడు వార్తల్లో దేనికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సి వస్తే ఈ మూడు అంశాలు ముఖ్యమైన విషయాలే. మూడింటికి సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉన్నా.. 'జీవశాస్త్రంలో భారత శాస్త్రవేత్తకు నోబెల్ బహుమతి' అనే వార్తకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. శాస్త్ర ఆవిష్కరణలో నోబెల్ బహుమతి అత్యున్నత బహుమతి. ఈ బహుమతి అందుకున్న భారతీయులు తక్కువ మంది ఉన్నారు. అదేవిధంగా సినీ కళారంగాల్లో ఇచ్చే అత్యున్నత పురస్కారం ఆస్కార్ అవార్డ్. ఈ అవార్డును సొంతం చేసుకున్న భారతీయులు కొద్దిమంది మాత్రమే. అందుకే ఈ అవార్డు ఓ భారతీయ కళాకారుడికి దక్కడం కూడా గొప్ప విషయమే.అందుకే నోబెల్ బహుమతి తర్వాత ఈ వార్తకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. ఇక ప్రపంచ క్రికెట్ కప్ అనేది ప్రతీ నాలుగేండ్లకొకసారి వస్తుంటుంది.ఇప్పటికే భారత్ ఈ కప్‌ను పలుమార్లు కైవసం చేసుకున్నది.చాలా సార్లు ఫైనల్‌కు వెళ్ళింది. మరోమారు టైటిల్ సొంతం చేసుకోవడానికి ఒక అడుగు దూరంలో ఉన్నది. అందుకే ప్రపంచ క్రికెట్ కప్ ఫైనల్లో భారత్ అనే అంశం అత్యంత ప్రాధాన్యత కల అంశమే. కోట్లాది మంది క్రికెట్ అభిమానులకు ఈ అంశం గొప్ప విషయమే. కానీ పై రెండు వార్తల తర్వాత ఈ వార్తకే ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. ఒకేసారి మూడు ప్రపంచ వార్తలు అందులో భారతీయత అనే అంశం మిళితమై ఉన్నప్పుడు ప్రాధాన్యతను గుర్తించడం క్లిష్టంగానే ఉంటుంది. అయితే ప్రపంచంలోనే ప్రతిష్ఠాత్మకం అనే అంశాన్ని బేరీజు వేసుకుని ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది.

..................

**మానసాని కృష్ణా రెడ్డి**
**9618616110**
**8074124190**

......................

## వార్త రాయడం ఎలా?

విలేకర్లు అంటే మేధావులంటారు. సమాజంలోని ప్రతీ విషయం మీద విలేకర్లకు అవగాహన ఉంటుంది. ఉండాలి కూడా. ప్రజల్లో ఉన్న అంచనాను అందుకోవడం మన కనీస బాధ్యత. పత్రిక అంటే జీరో మిస్టేక్స్ ఉండాలి. అక్షర దోషాలకు తావులేదు. వార్తను రాయడం ఎలా ? అనే విషయం మీద జర్నలిజంలో కనీస నిబంధనలున్నాయి. ఆ నిబంధనలను పాటించి వార్తను కూర్పు చేయాలి. అప్పుడే దాన్ని వార్తగా పరిగణిస్తారు. అయితే ఇప్పుడు తొంభైశాతం మంది విలేకర్లు పంపిస్తున్నవి వార్తల కిందకి రావనేది అక్షర సత్యం. ఎందుకంటే నేటి విలేకర్లు పంపేవి కేవలం నాయకులు తమ కోసం తాము రాసుకున్న కార్యక్రమాల వివరాలు అవి. నాయకులకు జర్నలిజం నిబంధనలు అక్కర్లేదు. కానీ అలా నిబంధనలు లేకుండా రాసుకున్న విషయాన్ని తీసుకుని యథాతథంగా విలేకర్లు వార్తంటూ పంపిస్తున్నారు. కానీ అలా మీరు పంపేది కాపీ పేస్ట్‌గానే మిగిలిపోతోంది తప్ప వార్తగా పరిగణించబడటం లేదు. మరి మనం కూడా వార్తను రాయడం ఎలా? అని మీకు తెలుసుకోవాలంటే ఈ విషయాన్ని శ్రద్ధగా గమనించండి.

**వార్త కూర్పు ఇలా ఉండాలి...**

హెడ్డింగ్ ( చిన్నదిగా ఉండాలి..పంచ్ హెడ్డింగ్ ఉండేలా చూసుకోవాలి)

సబ్ హెడ్డింగ్ (అన్నది ఎవరో చెప్పాలి: ఉదాహరణకు మాజీ మంత్రి పువ్వాడ అవినీతి పరుడు అని ఎవరో విమర్శించారనుకుందాం. అలాంటప్పుడు మంత్రి పువ్వాడను అవినీతిపరుడన్నదెవరో ఖచ్చితంగా ఉండాలి. పువ్వాడను విమర్శించిన నాయకుడు పేరు ఉండేదే సబ్ హెడ్డింగ్)

**డేట్‌లైన్ :** వాస్తవం: కరీంనగర్ ప్రతినిధి

**లీడ్:** ముఖ్యాంశం...ఉదాహరణకు.. ఒక కార్యక్రమంలో అనేక విషయాలు మాట్లాడుతుంటారు. అయితే అవేవీ మనకు అవసరం ఉండదు. మాట్లాడిన విషయంలో ముఖ్యమైన విషయమే లీడ్‌గా తీసుకోవాలి.'వచ్చే ఎన్నికల్లో టిఆర్ఎస్‌దే గెలుపని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.' శనివారం వరంగల్ ఏకశిల పార్క్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విధంగా అన్నారు.' ఇలా లీడ్ ఉండాలి. అంటే వరంగల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి ఎన్నో విషయాలు మాట్లాడుంటారు. ముందుగా అతిథులు పేర్లు చెబుతారు.మాజీ సీఎం కేసీఆర్‌ని పొగుడుతారు. ఇలా అనేక అనవసర విషయాలు మాట్లాడుతుంటారు. అవేవీ మనకు అవసరం లేదు. ఆయన మాట్లాడిన విషయాల్లో మనకు ఓ ముఖ్యమైన అంశాన్ని దొరకబట్టాలి. అలా దొరకబట్టిన అంశమే లీడ్ అవుతుంది. లీడ్ అనేది వార్తకు గుండెవంటిది. గుండెలేని వార్త జీవం లేనిదిగా ఉంటుంది.

కార్యక్రమంలో మంత్రి వార్తలోని

**ముఖ్యాంశం:**మాట్లాడిన ఇతర విషయాలు, ఆ తర్వాత ఎంఎల్ఎ, ఇతర ఎంఎల్‌సీలు మాట్లాడిన విషయాలను పొందుపర్చాలి.

**ముగింపు:** కార్యక్రమంలో పాల్గొన్నవారి పేర్లు ఉండాలి.

ఇలా ఒక వార్తను ఫ్రేమ్ చేయగలిగితే మంచి జర్నలిస్టుగా ఎదగగలుగుతారు. అదేవిధంగా ఎక్కడ ఫుల్‌స్టాప్ పెట్టాలో ఎక్కడ కామా వాడాలో తెలుసుకోవాలి. కింద వచ్చే పేర్లకు పేర్లకు మధ్య కామా మాత్రమే ఉండాలి. కానీ చాలామంది ఫుల్‌స్టాప్ పెడుతున్నారు. గమనించండి. ఇక మరియు స్థానంలో కామా వాడాలి. యొక్క, ఇట్టి అనే పదాలు వస్తున్నాయి. ఇట్టికి బదులుగా ఈ కార్యక్రమం అని వాడాలి. యొక్క వాడరాదు.

ఎవరు? ఏమిటి? ఎప్పుడు? ఎలా? ఎందుకు? అనేవిషయాలు మన వార్తలో ఉండాలి. ఉదాహరణకు ..ఓ రోడ్డు ప్రమాదం జరిగిందనుకుందాం. ఆ వార్తలో రోడ్డు ప్రమాదం ఎక్కడ జరిగింది? ఎలా జరిగింది? ఎప్పుడు జరిగింది? ఎవరు చేశారు? ఎందుకు జరిగింది? అనే విషయాలను పాఠకులు తెలుసుకోవాలనుకుంటారు. అలా వారు కోరుకున్న ప్రశ్నలకు సమాధానం చెప్పగలగడమే విలేకర్ల బాధ్యత. మరి మనం ఆ బాధ్యతను మరిచి గ్రూపులో దొరికిన అస్పష్ట, క్రమపద్ధతి లేని ఎవరో రాసిన విషయాన్ని పంపిస్తూ జర్నలిస్టులుగా కాలర్ ఎగరేసి తిరుగుతున్నాం. ఇది న్యాయమేనా? గమనించండి. నేటినుంచే వార్త రాయడం ఎలా? అనేవిషయం మీద దృష్టి నిలుపుదాం. మంచి జర్నలిస్టులుగా గర్వంగా తిరుగుదాం.

# త్వరితగతిన ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేసుకోవాలి

**ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోండి**

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**వాస్తవం : చందుర్తి**



ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు.చందుర్తి మండలం మల్యాల గ్రామంలో పులి పద్మ,పీసరి శిరీష కు సంబంధించిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు కొనసాగుతుండగా, జిల్లా కలెక్టర్ బుధవారం పరిశీలించారు. నిర్మాణ పనులు ఎప్పుడు మొదలు పెట్టారు? ఫోటోలు ఆన్ లైన్ లో అప్ లోడ్ చేస్తున్నారా? రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయం అందుతుందా అని ఆరా తీశారు.ఎప్పటిలోగా ఇండ్లు పూర్తి చేస్తారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకాన్ని సద్వినియోగం చేసుకొని.. తమ సొంత ఇంటి కల సాకారం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు అధికారులు అందుబాటులో ఉండి.. లబ్ధిదారుల ఇబ్బందులు దూరం చేయాలని ఆదేశించారు.బోర్ వెల్ రీచార్జ్ పనులకు శ్రీకారం చందుర్తి మండలం మల్యాల గ్రామంలోని కమ్యూనిటీ హాల్ వద్ద బోర్ వెల్ రీచార్జ్ పనులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శ్రీకారం చుట్టారు. బోర్ వెల్ రీచార్జ్ పనుల విస్తీర్ణం, దానిలో ఏ ఏ మెటీరియల్ ఎంత వేయాలి? తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో తెలంగాణ జలసిరి కింద నీటి సంరక్షణ పనులు ముమ్మరంగా చేయించాలని ఆదేశించారు. ప్రతి గ్రామం, మున్సిపాలిటీకి నిర్దేయించిన లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళిక ప్రకారం పనులు చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఆర్ డీఓ లక్ష్మీనారాయణ, హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు,జిల్లా పంచాయతీ అధికారి జయశీల, తహసీల్దార్ భూపతి,ఎంపీడీఓ రాధ సర్పంచ్ శారద,పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ విద్యార్థినిలకు వసతి సౌకర్యం కల్పిస్తాం

**జిల్లా కలెక్టర్ కే. హైమావతి**



**వాస్తవం : హుస్నాబాద్**

ఇంజనీరింగ్ కళాశాలలో చదివే విద్యార్థినిల కోసం వసతి సౌకర్యాలు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అన్నారు.బుధవారం హుస్నాబాద్ శాతవాహన ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినిల వసతి కోసం హుస్నాబాద్ పట్టణంలోని 20 వ వార్డులో గల రైతు బజార్ భవనంలో మొదటి, రెండవ అంతస్తును సందర్శించి అందులో విద్యార్థినిల వసతికి సంబంధించిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు మరియు శాతవాహన ఇంజనీరింగ్ కళాశాల సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు.శాశ్వత ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణం అయ్యేంతవరకు తాత్కాలికంగా విద్యార్థినిలకు కేటాయించిన మొదటి,రెండవ అంతస్తులో మౌలిక వసతులు, మరుగుదొడ్లు, మరియు భోజనం శాతవాహన ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యంతో కలిసి అన్ని సదుపాయాలను క్రమంగా కల్పిస్తామని తెలిపారు.కలెక్టర్ వెంట ఆర్డీఓ రామ్మూర్తి, తహసిల్దార్ లక్ష్మారెడ్డి, శాతవాహన ఇంజనీరింగ్ కళాశాల ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

# కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యం

**వాస్తవం : గోదావరిఖని**

తెలంగాణలో బీఆర్ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చి పార్టీ అధినేత కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు సమన్వయంతో పనిచేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు (కేటీఆర్) పార్టీ రామగుండం నియోజకవర్గ ముఖ్య నేతలకు సూచించారుహైదరాబాద్‌లోని కేసీఆర్ నివాసంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, సీనియర్ నాయకులు కౌశిక హరి వ్యాళ్ల హరీష్ రెడ్డితో కేటీఆర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా రామగుండం నియోజకవర్గంలో నెలకొన్న అంతర్గత విభేదాలు పార్టీ కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై సుదీర్ఘ చర్చించారు ఈ సమావేశంలో గ్రూపు రాజకీయాలకు పూర్తిగా స్వస్తి పలికి పార్టీ బలోపేతమే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలని కేటీఆర్ స్పష్టంగా ఆదేశించారు రామగుండం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు తెలియకుండా ఎలాంటి పార్టీ కార్యక్రమాలు నిర్వహించవద్దని కూడా సూచించారు అలాగే మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నియోజకవర్గంలోని నాయకులు కార్యకర్తల మధ్య సమన్వయం నెలకొల్పి పార్టీ కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కేటీఆర్ ఆదేశించారు రానున్న రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని రామగుండం నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడం నాయకులందరూ ఒకే వేదికపై పనిచేయడం ద్వారా కేడర్‌లో నూతన ఉత్సాహం నింపాలని సమావేశంలో కేటీఆర్ నిర్ణయం తీసుకున్నట్లు రామగుండం మాజీ శాసన సభ్యులు ఇంచార్జి కోరుకంటి చందర్ తెలిపారు



# ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

**ఆరుతడి, స్వల్పకాలిక పంటలు వేయాలి**

**వాన నీటిని సంరక్షించాలినీటి వృథాను అరికట్టాలి**

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మల్యాలలో గ్రామసభ**

**వాస్తవం : చందుర్తి**

ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉందని, రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఎల్ నినో పరిస్థితుల ప్రభావం.ప్రత్యామ్నాయ పంటల సాగుపై చందుర్తి మండలం మల్యాల లో బుధవారం గ్రామసభ నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా నీటి పారుదల శాఖ అధికారి రిజర్వాయర్లలో నీటి నిల్వలపై వివరించారు. ఇప్పుడు ఉన్న నీరు తాగు నీటికే వినియోగిస్తామని, పంటల సాగుకు ఇచ్చే పరిస్థితి లేదని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ..ఎల్ నినో ప్రభావం అందరిపై ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కింద ప్రత్యామ్నాయ పంటలు తదితర అంశాలపై అవగాహన కల్పించామని గుర్తు చేశారు. ఎల్ నినో ప్రభావం, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని రాజన్న సిరిసిల్ల జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే భూగర్భ జలాలు తగ్గుతున్నాయని వెల్లడించారు.చందుర్తి మండలంలో గత ఏడాది 328 మిల్లీమీటర్ల వర్షం నమోదు అయిందని తెలిపారు. ఈ ఏడాది 230 మిల్లిమీటర్ల వర్షం కురిసిందని వివరించారు. భూగర్భ జలాలు గత ఏడాది 4.38 మీటర్ల లోతులో ఈ ఏడాది 8.53 మీటర్ల లోపలికి వెళ్లాయని వెల్లడించారు.జిల్లాలోని ఎగువ మానేరు, శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు), మల్కపేట, అన్నపూర్ణ రిజర్వాయర్లలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయని తెలిపారు.ఈ నీరు తాగునీటికి సరిపోతుందని పేర్కొన్నారు. వ్యవసాయ పొలాలు, ఇండ్లలో నీటిని వృథా చేయవద్దని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రైతులు స్వల్ప కాలిక పంటలు, కూరగాయలు,పప్పు ధాన్యాలు,మొక్క జొన్న, నువ్వులు, అధిక ఆదాయం వచ్చే ఆయిల్ పామ్ సాగు చేయాలని సూచించారు. ప్రస్తుతం ఒక టన్ను ఆయిల్ పామ్ కు రూ. 23 వేల ఆదాయం వస్తుందని వివరించారు. చందుర్తి మండలంలో92 ఎకరాల్లో ఆయిల్ పామ్ వేశారని, మిగతా రైతులు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా నర్మెట్ట వద్ద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారని తెలిపారు.వీబీ జీ రాంజీ, తెలంగాణ జలసిరి కింద జల సంరక్షణకు ఎన్నో పథకాలు ఉన్నాయని వివరించారు.



ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు, బోర్ వెల్స్ రీచార్జ్ పనులు, అలాగే రైతుల పొలాల వద్ద పామ్ పాండ్స్, బోర్ వెల్ రీచార్జ్ పనులు ముమ్మరంగా చేయాలని ఆదేశించారు. ప్రతి వర్షం నీటి బొట్టును ఒడిసి పట్టాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చెల్లా తిరుపతి, వేములవాడ ఆర్ డిఓ కె ఎస్ బి కుమారి, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, డీఆర్ డీఓ లక్ష్మీనారాయణ, పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పంచాయతీ అధికారి జయశీల, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి దయాకర్, రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత సాయి కుమార్, హౌసింగ్ డీఈ సాజిద్, తహసీల్దార్ భూపతి, ఎంపీడీఓ రాధ, సర్పంచ్ శారద, తదితరులు పాల్గొన్నారు.

# భూముల రీ సర్వే కచ్చితత్వంతో చేయాలి

**వివరాలు పక్కాగా నమోదు చేయాలి**

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**చంద్రగిరిలో భూ భారతి కింద భూముల రీ సర్వే పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్**



**వాస్తవం : వేములవాడ**

భూ భారతి కింద భూముల రీ సర్వే కచ్చితత్వంతో చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ అర్బన్ మండలం చంద్రగిరిలో భూ భారతి కింద రోవర్ యంత్రంతో భూముల రీ సర్వే పనులు కొనసాగుతుండగా, బుధవారం జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే యంత్రంతో వివరాలు ఎలా తీసుకుంటారో పరిశీలించి.. అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో భూ భారతి కింద భూముల రీ సర్వే పనులు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో సర్వే పై రైతులకు ముందుగా సమాచారం అందించాలని సూచించారు.భూముల వివరాలను పూర్తి కచ్చితత్వంతో నమోదు చేయాలని స్పష్టం చేశారు. రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శి ఇతర అధికారులు సమన్వయంతో పనులు గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈకార్యక్రమంలో ఆర్ డిఓ కెఎస్ బి కుమారి, ఏడీ సర్వే శ్రీనివాస్, తహసీల్దార్ జయంత్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ

# కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలి

**నీలం మధు ముదిరాజ్**




**వాస్తవం : పటాన్ చెరు**

దేశంలో ప్రజాస్వామ్యాన్ని పూడ్చిపెట్టి, ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్ర కుట్రలు చేస్తోందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ నీలం మధు ముదిరాజ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజల తరపున నిలబడి కేంద్రాన్ని నిలదీస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రజాదరణను చూసి కేంద్ర ప్రభుత్వం భయపడుతోందని, అందులో భాగంగానే ఆయనతో పాటు ప్రతిపక్ష నేతలను అక్రమంగా అరెస్ట్ చేయిస్తోందని మండిపడ్డారు. రాహుల్ గాంధీ తో పాటు ప్రతిపక్ష నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ, నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో ఏఐసీసీ పిలుపు మేరకు, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన 'చలో లోక్ భవన్' నిరసన కార్యక్రమంలో నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు. నెక్లెస్ రోడ్‌లోని ఇందిరమ్మ విగ్రహం వద్దకు వేలాదిగా తరలి వచ్చిన కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు,విద్యార్థులు యువతతో కలిసి రాజ్ భవన్ వైపు భారీ ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ రాత్రింబవళ్లు కష్టపడి చదివిన లక్షలాది మంది నిరుపేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తుతో బీజేపీ ప్రభుత్వం దారుణంగా చెలగాటమాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా నీట్ పేపర్ లీకేజీ కుంభకోణంతో విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టారని విమర్శించారు. ఈ దారుణమైన వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.కక్షసాధింపు చర్యలతో ప్రతిపక్ష నాయకులను జైలుకు పంపినంత మాత్రాన కాంగ్రెస్ పోరాటాలను ఆపలేరని స్పష్టం చేశారు.విద్యార్థుల, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్న బీజేపీ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో దేశ ప్రజలు, యువత తగిన బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, వీర్లపల్లి శంకర్, అంబర్ పేట్ ఇంచార్జ్ డాక్టర్ సి రోహిన్ రెడ్డి, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్, డీసీసీ అధ్యక్షులు మోత రోహిత్,ఎంపీలు,ఎమ్మెల్యేలు,ప్రజా ప్రతినిధులు,యూత్ కాంగ్రెస్,ఎన్ఎస్ యుఐ శ్రేణులు, కాంగ్రెస్ నాయకులు,తదితరులు భారీగా పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియపై అఖిలపక్ష నేతలతో

# ఆర్ డి ఓ సమీక్ష



**వాస్తవం: వేములవాడ**

పొడగించిన సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ గడువును ప్రతి ఓటరు సద్వినియోగం చేసుకోవాలని ఓటర్ లకు వేములవాడ రెవెన్యూ డివిజన్ అధికారి కె ఎస్ బి కుమారి విజ్ఞప్తి చేశారు. వేములవాడ రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో బుధవారం అఖిలపక్షం నాయకులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.ఎన్నికల సంఘం విధించిన గడువు నేపథ్యంలో సర్ ప్రక్రియ సంపూర్ణంగా,పారదర్శకంగా పూర్తి చేయాలని బిఎల్ఒ, బిఎల్ఎ లకు ఆర్ డిఓ విజ్ఞప్తి చేశారు.సర్ ప్రక్రియ కార్యక్రమం విజయవంతం చేయడానికి ఒక్కరు భాగస్వాములు కావాలని, పొడగించిన 10 రోజుల గడువు ఆగస్టు 3 వ తేదీతో ముగిస్తున్నందున ప్రతి ఒక్కరు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, అమూల్యమైన ఓటును సద్వినియోగ పరుచుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు లభించేలా బిఎల్ఒ లు, బిఎల్ఎ లు పకడ్బందీగా కృషిచేయాలని కోరారు. అఖిలపక్ష నేతల సమీక్ష సమావేశంలో పొలాస నరేందర్, మైలారం రాము, పిన్నింటి హన్మాండ్లు,చింతలకోటి రామస్వామి గౌడ్, శ్రావణ్, ఎన్నికల జూనియర్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీ

# బోయినపల్లి వినోద్ కుమార్ జన్మదిన వేడుకలు

**వాస్తవం : చందుర్తి**



చందుర్తి మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యులు వినోద్ కుమార్ జన్మదిన వేడుకలను బుధవారం చందుర్తిమాజీ ఎంపీపీ చిలక పెంటయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ నాయకులు బత్తుల కమలాకర్,దుమ్మ అంజయ్య,సిరి కొండ మల్లయ్య,దీకొండ తిరుపతి రావు,శ్రీనివాస్,గంగస్వామి ,అనిల్,సతీష్,లింగంపల్లి రాములు,తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ పతాకాన్ని గౌరవించడం కర్తవ్యంగా భావించాలి

**ఖనిలో ఘనంగా జాతీయ పతాక ఆవిష్కరణ దినోత్సవ అవగాహన ర్యాలీ**

**వాస్తవం : గోదావరిఖని**




భారత జాతీయ పతాక ఆవిష్కరణ దినోత్సవం సందర్భంగా దేశభక్తిని జాతీయ ఐక్యతను చాటిచెప్పే ఉద్దేశ్యంతో లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం రీజినల్ చైర్‌పర్సన్ శ్రీమతి సోమారపు లావణ్య, ప్రెసిడెంట్ ఫోరమ్ అధ్యక్షులు బంక రామస్వామి ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖని పట్టణంలో అవగాహన ర్యాలీ ఘనంగా నిర్వహించారు ర్యాలీలో వివిధ లయన్స్ క్లబ్ ల సభ్యులు మహిళా సభ్యులు యువత విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని చేతుల్లో జాతీయ జెండాలతో "భారత్ మాతాకీ జై", "వందే మాతరం", "జై హింద్" వంటి దేశభక్తి నినాదాలు చేస్తూ ముందుకు సాగారు సోమారపు లావణ్య, ప్రెసిడెంట్ ఫోరం అధ్యక్షులు బంక రామస్వామి మాట్లాడుతూ,1947 జూలై 22న భారత రాజ్యాంగ సభ త్రివర్ణ పతాకాన్ని భారత జాతీయ పతాకంగా అధికారికంగా ఆమోదించిన చారిత్రాత్మక రోజును పురస్కరించుకొని ఈ ర్యాలీని నిర్వహిస్తున్నామని తెలిపారు. జాతీయ పతాకం దేశ సమైక్యతకు, సార్వభౌమాధికారానికి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ప్రతీక అని పేర్కొన్నారు ప్రతి భారతీయుడు జాతీయ పతాకాన్ని గౌరవించడం తన ప్రథమ కర్తవ్యంగా భావించాలని యువతలో దేశ భక్తి భావాన్ని పెంపొందించే కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.లయన్స్ క్లబ్ సమాజ సేవతో పాటు జాతీయ చైతన్యాన్ని పెంపొందించే కార్యక్రమాలను కూడా నిరంతరం చేపడుతుందని వారు తెలిపారు దేశాభివృద్ధి జాతీయ ఐక్యత సామాజిక బాధ్యతల పట్ల ప్రతి పౌరుడు తన వంతు పాత్రను పోషించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మాజీ రీజిన్ చైర్‌పర్సన్ రాజేందర్ మెంటర్ గంగాధర్ నార్ల ప్రసాద్ అంజనేయులు జోన్ చైర్‌పర్సన్ సుధాకర్ శ్రీమతి డాక్టర్ లక్ష్మీవాణి శ్రీమతి గాలి సునీత ఏలేశ్వరం చంద్రమౌళి తోపాటు వివిధ లయన్స్ క్లబ్‌ల అధ్యక్షులు లయన్ అర్చన -- సంతోష్ రావు అంబటి లయన్ మహేందర్ లయన్ కృష్ణమూర్తి, లయన్ రాహుల్ లయన్ కిషోర్ లయన్ మహేంద్ర రెడ్డి లయన్ అనిల్ రావు లయన్ భవాని -- సురేష్ తదితరులతో పాటు లయన్స్ క్లబ్ సభ్యులు ఆపిల్ కిడ్స్ స్కూల్ శ్రీరామ విద్యానికేతన్ స్పెక్ట్రమ్ స్కూల్ విద్యార్థులు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ప్రణాళిక ప్రకారం నిర్మాణ పనులు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనుల పరిశీలన**

**వాస్తవం: చందుర్తి**

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. చందుర్తి మండలం మూడపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులు కొనసాగుతుండగా, జిల్లా కలెక్టర్ బుధవారం పరిశీలించారు. నిర్మాణ మ్యాప్ పరిశీలించి..ఏ ఏ నిర్మాణాలు ఎక్కడ చేస్తారో అడిగి తెలుసుకున్నారు. ఎప్పటిలోగా పూర్తి అవుతుందని ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కూలీల సంఖ్యను పెంచి.. పనుల్లో వేగం పెంచాలని సూచించారు. మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్ చందుర్తి మండలం మూడపల్లిలోని శ్రీ వెంకటేశ్వర ఆలయం ఆవరణలో వన మహోత్సవం కింద జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మొక్కలు నాటారు. ఏ ఏ మొక్కలు.. ఎన్ని నాటుతున్నారు? అని ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.... మహోత్సవం కింద లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని, ప్రతి మొక్కను సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రతి ప్రభుత్వ శాఖ తమ లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకొని ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఆర్ డిఓ కె ఎస్ బి కుమారి, టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్, డీఆర్ డీఓ లక్ష్మీ నారాయణ, తహసిల్దార్ భూపతి, ఎంపీడీఓ రాధ, సర్పంచ్ మల్లీశ్వరి, అటవీ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# చర్ల పరపతి సంఘంలో రైతు రుణాల జాప్యం

**సీజన్ ప్రారంభమైనా కొత్త, రెన్యువల్ లోన్లు లేక**

**రైతుల తీవ్ర ఇబ్బందులు**

**"సెంట్రల్ బ్యాంక్ అలాట్మెంట్ రాలేదు" చైర్మన్,సీఈవో**

**చర్ల : వాస్తవం**

చర్ల మండలంలో వ్యవసాయ సీజన్ ప్రారంభమైనా వ్యవసాయ పరపతి సంఘంలో రైతులకు కొత్త రుణాలు,పాత రుణాల రెన్యువల్ ఇప్పటివరకు జరగలేదు. దీంతో రైతులు విత్తనాలు, ఎరువుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ అంశంపై వాస్తవం రిపోర్టర్ వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ పరుచూరి రవికుమార్, సీఈవో ప్రభుకుమార్ లను సంప్రదించగా.."మాకు ఇంకా సెంట్రల్ బ్యాంక్ నుంచి పరిమిషన్ అలాట్మెంట్ రాలేదు. ఆ నిధులు వచ్చిన తర్వాత రైతులకు రుణాలు మంజూరు చేయగలం. ప్రస్తుతానికి మా దగ్గర బడ్జెట్ లేదు. ఎవరైనా ఖాతాదారులు లోను పూర్తిగా చెల్లించి డ్రాప్ అయితే ఆ వచ్చిన అమౌంట్ ని కొత్త లోన్లకు ఇచ్చే అవకాశం ఉంటుంది.కానీ ఇంతవరకు ఎవరు రీపేమెంట్ చేయడం లేదు.కొంతమంది మాత్రమే రెన్యువల్ చేసుకుంటున్నారు" అని చైర్మన్ పరుచూరి రవికుమార్ తెలిపారు.కమర్షియల్ బ్యాంకుల్లో మాత్రం జూన్ నుంచే వ్యవసాయ పరపతి రుణాలు ఇస్తున్నారు. రైతుల కోసమే ప్రత్యేకంగా ఏర్పాటైన



పరపతి సంఘంలోనే రుణాలు ఎందుకు ఆలస్యం అవుతున్నాయని అడగగా, పై కారణాలనే అధికారులు పేర్కొన్నారు. సీజన్ సమయంలో రుణాలు అందకపోవడంతో చాలా మంది రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే సెంట్రల్ బ్యాంక్ నుంచి నిధులు రిలీజ్ చేయించి, చర్ల వ్యవ సాయ పరపతి సంఘం ద్వారా రైతులకు సకాలంలో రుణా లు అందేలా పరపతి సంఘం సభ్యులు, అధికారులు చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



# ప్రత్యామ్నాయ పంటలే శరణ్యం

**వాతావరణ మార్పులపై ప్రత్యేక గ్రామసభ**



**వాస్తవం : మద్దూరు**

మద్దూరు గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దామర మల్లేశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో రామ్మోహన్, వ్యవసాయ అధికారి రామకృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వర్లు,ఎపిఓ మంజుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, సర్పంచ్ దామెర మల్లేశం మాట్లాడుతూ... ఎల్ నినో ప్రభావం వల్ల వాతావరణంలో వచ్చే మార్పులు, వర్షాభావ పరిస్థితులు, మరియు వ్యవసాయ రంగంపై దాని ప్రభావాన్ని గ్రామ ప్రజలకు వివరించారు. రాబోయే రోజుల్లో నీటిని పొదుపుగా వాడుకోవాలని, రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. ప్రభుత్వ సూచనలను పాటిస్తూ వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు.?ఈ గ్రామసభలో ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ స్థాయి అధికారులు, వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు కేంద్రం కుట్ర

**రాహుల్ గాంధీని చూసి కేంద్ర ప్రభుత్వం భయపడుతోంది**

**లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో బీజేపీ చెలగాటం**

**నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలి**

**నర్సాపూర్ నియోజకవర్గం ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి**

**నర్సాపూర్ : వాస్తవం**

నర్సాపూర్ పట్టణంలో ఎస్ ఐ ఆర్ కోఆర్డినేటర్ వెన్నెల అన్వేష్‌రెడ్డి ముందుగా నరసాపూర్ చిల్డ్రన్ పార్కులో భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ర్యాలీగా బయలుదేరి నర్సాపూర్ చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మలు దహనం చేసి కేంద్రం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పూడ్చిపెట్టి, ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్ర కుట్రలు చేస్తోందని నర్సాపూర్ నియోజకవర్గంలో ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజల తరఫున నిలబడి కేంద్రాన్ని నిలదీస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రజాదరణను చూసి కేంద్ర ప్రభుత్వం భయపడుతోందని, అందులో భాగంగానే ఆయనతో పాటు ప్రతిపక్ష నేతలను అక్రమంగా అరెస్ట్ చేయిస్తోందని మండిపడ్డారు. రాహుల్ గాంధీ తో పాటు ప్రతిపక్ష నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ, నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర



మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్ చేశారు. వేలాదిగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు యువతతో భారీ ర్యాలీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ రాత్రింబవళ్లు కష్టపడి చదివిన లక్షలాది మంది నిరుపేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తుతో బీజేపీ ప్రభుత్వం దారుణంగా చెలగాటమాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా నీట్ పేపర్ లీకేజీ కుంభకోణంతో విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టారని విమర్శించారు. ఈ దారుణమైన వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కక్షసాధింపు చర్యలతో ప్రతిపక్ష నాయకులను జైలుకు పంపినంత మాత్రాన కాంగ్రెస్ పోరాటాలను ఆపలేరని స్పష్టం చేశారు. విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్న బీజేపీ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో దేశ ప్రజలు, యువత తగిన బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు యువజన కాంగ్రెస్ ఎన్ ఎస్ యు ఐ నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్ ఐ ఆర్ డి పి ఆర్‌ను అవార్డింగ్ బాడీగా గుర్తించిన ఎన్సివిఈటి



**వాస్తవం : రాజేంద్రనగర్**

జాతీయ నైపుణ్య అభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్(ఎన్ సి వి ఈ టి) హైదరాబాద్ రాజేంద్రనగర్ లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ అండ్ పంచాయతీ రాజ్ (ఎన్ఐఆర్ డిపి ఆర్) ను 'అవార్డింగ్ బాడీ' (ద్వంద్వ గుర్తింపు)గా అధికారికంగా గుర్తించింది. ఈ మేరకు జూలై 21న ఢిల్లీలో ఒక ఒప్పందం పై సంతకం చేశాయి.గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖల కోసం వృత్తి, నైపుణ్య కోర్సుల విభాగాలలో ఎన్సివిఈటి ఆమోదిత కోర్సులను ప్రారంభించాలని ఎన్ ఐ ఆర్ డి పి ఆర్ ప్రణాళిక చేసింది.నైపుణ్యాభివృద్ధి వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, ఎన్ సి వి ఈ టి కార్యనిర్వాహక సభ్యులు నిరంజన్ కుమార్ సుదాన్షు అధ్యక్షతన ఈ ఒప్పంద సంతకాలు జరిగాయి.ఈ కార్యక్రమానికి ఎన్సివిఈటి గుర్తింపు విభాగం డైరెక్టర్ లెఫ్టినెంట్ కల్నల్ విక్రమ్ సింగ్ భాటి, పర్యవేక్షణ విభాగం డైరెక్టర్ లెఫ్టినెంట్ కల్నల్ సౌరబ్ ఎస్. బిష్త్, దూరవిద్య కేంద్రం ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతిష్ సత్య పాలన్, రిసోర్సెస్ శిక్షణ అభివృద్ధి విభాగం డైరెక్టర్ డాక్టర్ సంధ్యా గోపకుమారన్ హాజరయ్యారు.

# మారుమూల గిరిజన గూడెంలో కొత్త పాఠశాల

**బక్కచింతలపాడులో రూ.2.5 లక్షలతో భవనం ప్రారంభం**

**విద్యాభివృద్ధికి పోలీస్ శాఖ అన్ని విధాల కృషి చేస్తుంది**

**జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఐపీఎస్**

**చర్ల : వాస్తవం**

ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతమైన చర్ల మండలం బక్కచింతలపాడు గిరిజన గ్రామంలో పోలీసు శాఖ సహకారంతో నిర్మించిన నూతన పాఠశాలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఐపీఎస్ బుధవారం ప్రారంభించారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల ప్రజల సంక్షేమం, గిరిజన విద్యార్థుల అభివృద్ధి కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. ఈ ఏజెన్సీ గ్రామంలో నిరుపేద విద్యార్థుల కోసం సుమారు రూ. 2.5 లక్షల వ్యయంతో పాఠశాల భవనాన్ని నిర్మించారు. ఎస్పీ రోహిత్ రాజు సూచనలతో భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో, చర్ల సీఐ ఏ.రాజువర్మ నేతృత్వంలో నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ నిర్మాణానికి ఎస్సై ఆర్.నర్సిరెడ్డి మిత్రబృందం (ఖుమ్మా), చర్ల సీఐ రాజువర్మ, ఎస్సైలు ఆర్.నర్సిరెడ్డి, పి.కేశవ్ మరియు పోలీస్ సిబ్బంది ఆర్థికంగా సహకారం అందించారు. పోలీసు సిబ్బంది ప్రత్యక్ష పర్యవేక్షణలో పాఠశాల నిర్మాణం పూర్తయింది. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజ్ మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి పోలీసు శాఖ అన్ని విధాలా కృషి చేస్తుందని అన్నారు. గిరిజన





పిల్లలు చదువు ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ అరుణ్ కుమార్, సీఐ రాజువర్మ, ఎస్సైలు, స్థానిక గిరిజనులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాఠశాల ప్రారంభంతో బక్కచింతలపాడు మరియు చుట్టుపక్కల గూడెల విద్యార్థులకు విద్యా సౌకర్యం మెరుగుపడుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# బురదమయమైన పాఠశాల దారికి విముక్తి

**సర్పంచ్ షేక్ యాస్మిన్ ఫిరోజ్ పాషా కృషి**

**వాస్తవం : కోనరావుపేట**

ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం తీవ్రంగా దెబ్బతింది. వర్షపు నీరు చేరడంతో విద్యార్థులు నడిచే ప్రధాన దారితో పాటు, టాయిలెట్లు, వాష్‌రూమ్‌లకు వెళ్లే త్రోవ అంతా పూర్తిగా బురదమయంగా మారింది. దీంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయులు రాకపోకలు సాగించడానికి తీవ్ర అవస్థలు పడ్డారు. ముఖ్యంగా చిన్న పిల్లలు జారిపడే ప్రమాదం ఏర్పడటంతో ఆందోళన వ్యక్తమైంది. ఈ సమస్యపై సమాచారం అందుకున్న గ్రామ సర్పంచ్ షేక్ యాస్మిన్ ఫిరోజ్ పాషా తక్షణమే స్పందించారు. విద్యార్థుల ఇబ్బందులను తన స్వంత కుటుంబ సమస్యగా భావించి, వారి భద్రత, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే రంగంలోకి దిగారు. పాఠశాల ప్రాంగణంలోకి భారీ వాహనాల ద్వారా మట్టిని తెప్పించి, ప్రధాన దారితో పాటు టాయిలెట్లకు వెళ్లే త్రోవపై పోయించి చదును చేయించారు. ఒక మహిళా సర్పంచ్‌గా గ్రామంలోని ప్రతి విద్యార్థికి సురక్షితమైన వాతావరణం కల్పించడమే తమ ప్రధాన బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. బడికి వచ్చే పిల్లలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా విద్యను అభ్యసించాలనే





సేవా సంకల్పంతో గ్రామ సర్పంచ్ షేక్ యాస్మిన్ ఫిరోజ్ పాషా నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. సమయానికి స్పందించి సమస్యను తీర్చిన సర్పంచ్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**సమగ్ర ఓటర్ల సవరణ బూత్‌లను**

# పరిశీలించిన తుంగతుర్తి రవి



**మేడిపల్లి : వాస్తవం**

మేడిపల్లి డివిజన్ పరిధిలోని పర్వతపురం గ్రామపంచాయతీలో 520 నుండి 526 మేడిపల్లి డివిజన్ పరిధిలోని పర్వతపురం గ్రామపంచాయతీలో 520 నుండి 526 బూత్‌ల వరకు నిర్వహిస్తున్న సమగ్ర ఓటర్ల సవరణ ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్‌ల వద్ద జరుగుతున్న ఎన్యూమరేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్కుల పనితీరు, ఓటర్లకు అందుతున్న సేవలను సమీక్షించారు. కార్యక్రమం మరింత సమర్థవంతంగా నిర్వహించి, అర్హులైన ప్రతి ఓటరు వివరాలు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే ప్రజలు సమగ్ర ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ వివరాలను సరిచూసుకుని ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటు విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అందరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ముదిగొండ రమేష్, యాసారం నాగేష్, సుదర్శన్ రెడ్డి, ఉదయ్ రాజ్ గౌడ్, కృష్ణ, అజయ్ రెడ్డి, సాయిరాం గౌడ్, బద్దం సాయిరాం రెడ్డి, నటరాజ్, ప్రణయ్, ఏఎంసి శ్యామ్ సుందర్ రావ్ , ఆర్ ఓ శ్రీనివాస్ రెడ్డి ,శానిటేషన్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ మరియు బి ఎల్ ఓ, బి ఎల్ ఏ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలపై అవగాహన సదస్సు



**వాస్తవం : మద్నూర్**

కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో, మహిళా సాధికారిత కేంద్రం మద్నూర్లో జడ్పీహెచ్ఎస్ స్కూల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది కార్యక్రమంలో భాగంగా బేటి బచావో బేటి పడావో, చైల్డ్ మ్యారేజెస్, పోక్సో యాక్ట్, సైబర్ క్రైమ్, ఆల్ హెల్ప్ లైన్ నెంబర్స్ పోష్ ఆక్ట్ పైన చక్కగా అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం కామారెడ్డి పోలీస్ కళాబృందం ఇంచార్జ్ రామాచ తిరుపతి. శేషరావు. సాయిలు. పాటలు మాటల ద్వారావిద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించడమైనది. ఈ కార్యక్రమంలో మోహన్ రెడ్డి ఎస్సై మద్నూర్, ఎం ఈ ఓ.రా జ సి. డి. పి.ఓ.కళావతి, హెడ్ మాస్టర్ రాజేందర్, డి .హాబ్ శారద ,తులసి గార్లు పాల్గొనడం జరిగింది.

# పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిర్వహణకు ప్రజలు సహకరించాలి

**ఉమ్మడి జిల్లా గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్**

**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**





జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే 2026లో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం గోపాలరావుపల్లె లో బుధవారం సర్వే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఉమ్మడి జిల్లా గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా తంగళ్ళపల్లి మండలంలో గోపాలరావుపల్లి గ్రామ సర్పంచ్‌ని వారి కార్యాలయంలో కలిసి సర్వేకు సంబంధించిన కరపత్రాలను అందజేసి, సర్వే లక్ష్యాలు, ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగాగుర్రం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ...దేశంలో ఉపాధి, నిరుద్యోగం, కార్మిక శక్తి భాగస్వామ్యం, స్వయం ఉపాధి, తదితర అంశాలకు సంబంధించిన విశ్వసనీయ గణాంకాలను రూపొందించేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారుసర్వేలో మొదటి దశలో కుటుంబాల సాధారణ వివరాలను నమోదు చేసిన అనంతరం, ఎంపికైన కుటుంబాలను మూడు నెలల పాటు ప్రతి నెల ఒకసారి సందర్శించి మొబైల్ ట్యాబ్ ద్వారా సమాచారాన్ని సేకరిస్తామని తెలిపారు. కుటుంబ సభ్యుల విద్యార్హతలు, విద్యాభ్యాసం, వృత్తి విద్య, ఉద్యోగం, స్వయం ఉపాధి, రోజువారీ కూలి పనులు, పని చేసిన గంటలు, వేతన వివరాలు, మహిళల ఆదాయ వనరులు, అలాగే జొమాటో, స్విగ్గీ, రాపిడో, ఓలా, ఉబెర్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా పనిచేస్తున్న గిగ్ మరియు ప్లాట్‌ఫారమ్ కార్మికుల వివరాలను కూడా నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఈ సర్వే ద్వారా సేకరించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని, గణాంకాల రూపకల్పనకు మాత్రమే వినియోగిస్తామని తెలిపారు. ప్రజలు ఎలాంటి సందేహాలు లేకుండా సరైన సమాచారాన్ని అందించి సర్వే విజయవంతం కావడానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గోపాలరావుపల్లె గ్రామపంచాయతీ సర్పంచ్ గుండు ప్రేమ్ కుమార్, ఉప సర్పంచ్ గొట్ల ఎల్లయ్య యాదవ్, కార్యదర్శి గంగుల ప్రశాంత్, వార్డు సభ్యులు, అంగన్ వాడీ టీచర్ మునిగే పద్మ, ఆశా వర్కర్లు పసుల లావణ్య, రంగు జ్యోతి, కారోబార్ ఎడ్ల రాజశేఖర్, గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్టు,నీట్ అక్రమాలపై కాంగ్రెస్ నాయకులు ధర్నా

**ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి**

**కాటా శ్రీనివాస్ గౌడ్**

**వాస్తవం : అమీన్ పూర్**



ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జరిగిన నిరసన కార్యక్రమంలో నిరుద్యోగ యువతపై దాడి చేయడాన్ని నిరసిస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం ఎదుట చేపట్టిన ఆందోళనలో పాల్గొన్న లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ బుధవారం అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలో బీరంగూడ కిష్టారెడ్డిపేట రహదారి పై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పించిందని, ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్ష నాయకుడిని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విలువలను అవమానపరచడమేనని అన్నారు. ప్రతిపక్షం ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం, విమర్శిస్తే కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించడం బీజేపీ ప్రభుత్వంలో నిత్యకృత్యంగా మారిందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను గౌరవించాల్సిన కేంద్ర ప్రభుత్వం నిరంకుశ ధోరణితో వ్యవహరించడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు.దేశరాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని,ప్రజల హక్కులను పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జరుగుతున్న ఈ పోరాటంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి,ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్,మార్కెట్ కమిటీ చైర్మన్‌శివానందం,సురేష్,ప్రవీణ్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# వేములవాడను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**వాస్తవం : వేములవాడ**



వేములవాడ ను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వెల్లడించారు. రూ. 49.50 లక్షలతో డంపింగ్ యార్డుకు వెళ్లే అప్రోచ్ సీసీ రోడ్డు, టాయిలెట్ బ్లాక్ నిర్మాణానికి బుధవారం ఆది శ్రీనివాస్ భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ..పట్టణ పరిశుభ్రత, శాస్త్రీయ చెత్త నిర్వహణ,ఆధునిక మౌలిక వసతుల కల్పనతో ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.రాజన్న ఆలయ అభివృద్ధి,మూడో వంతెన, రోడ్ల విస్తరణ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సామాజిక భవనాల నిర్మాణం, సంక్షేమ పథకాల అమలుతో వేములవాడను రాష్ట్రంలోనే ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు,వైస్ చైర్మన్ నరాల శేఖర్,కౌన్సిలర్లు,కో-ఆప్షన్ సభ్యులు,అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య

**వాస్తవం : తిరుమలగిరి**



ఢిల్లీలో జరిగిన శాంతియుత నిరసన కార్యక్రమంలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ,కాంగ్రెస్ పార్టీ మరియు ఇండియా కూటమి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని తిరుమలగిరి మున్సిపాలిటీ 8వార్డ్ కౌన్సిలర్ గోడిశాల వెన్నెల అంజి గౌడ్ తీవ్రంగా ఖండించారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పించిందని, అలాంటి రాజ్యాంగబద్ధమైన హక్కులను కాలరాస్తూ ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రజల తరఫున ప్రశ్నించే గొంతులను అణచివేయడానికి బీజేపీ కేంద్ర ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని విమర్శించారు. దేశంలోని రైతులు, యువత, విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగులు మరియు అణగారిన వర్గాల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ మరియు ఇండియా కూటమి నాయకులపై ఇటువంటి నిర్బంధ చర్యలు చేపట్టడం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే చర్య అని పేర్కొన్నారు. అక్రమ అరెస్టులతో ప్రజల గొంతును ఎవరూ అణచలేరని స్పష్టం చేశారు. రాజకీయ కక్షసాధింపు ధోరణిని కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకుని, ప్రజాస్వా మ్య విలువలను పరిరక్షించాలని,ప్రతిపక్ష నాయకులపై వేధింపులు, అక్రమ అరెస్టులు వంటి చర్యలను తక్షణమే నిలిపివేయాలని గోడిశాల వెన్నెల అంజి గౌడ్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో విభిన్న అభిప్రాయాలను గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని,ప్రజల హక్కులు, స్వేచ్ఛలను హరించే చర్యలు దేశ ప్రజాస్వామ్యానికి తీవ్ర హానికరమని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు.

# శ్మశానవాటికకి స్థలం కేటాయించాలి

**బీఆరెస్ నాయకులు కొంచె శివరాజ్**

**వాస్తవం : శేరిలింగంపల్లి**



స్మశానవాటికగా కొనసాగుతున్న స్థలాన్ని దానికే కేటాయించాలని,మియపూర్ మక్త మహబూబ్ పేట్ బీఆరెస్ నాయకులు కొంచె శివరాజ్ అన్నారు.బుధవారం స్థానిక మక్త ప్రాంతానికి చెందిన మహిళ చనిపోగా, స్మశానవాటికలో ఖననం చేయడానికి వెళ్లిన వారిని అక్కడి వారు అడ్డుకున్నారని తెలుసుకున్న స్థానిక నాయకుడు కొంచె శివరాజ్ ఘటనా స్థలికి చేరుకొని, శేరిలింగంపల్లి తహశీల్దార్ తో మాట్లాడి, సామరస్యంగా మృతురాలి ఖననం చేపించి తాత్కాలిక సమస్యని పరిష్కరించారు. స్థానిక సమస్యలపై ఎమ్మార్వో సానుకూలంగా స్పందించారని, సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని కొంచె శివరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆరెస్ మహిళా నాయకులు రోజా,కిరణ్,కాసాని శ్రీధర్ కొంచ ప్రభాకర్ గోపరాజు శ్రీనివాస్ ఫారనంది నర్సింగరావు గుండె రాజు సుధాకర్ రాజు మల్లన్న చిన్న పలువురు స్థానికులు పాల్గొన్నారు.

**బోడుప్పల్ డివిజన్ అంబేద్కర్ నగర్ కాలనీలో**

# మొక్కల పంపిణీ కార్యక్రమం

**ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి**

**డివిజన్ అధ్యక్షులు బొమ్మకు కళ్యాణ్**



**మేడిపల్లి : వాస్తవం**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ డివిజన్ అంబేద్కర్ నగర్ కాలనీలో, బస్తీ దవాఖాన సమీపంలో కాలనీ ప్రజలకు ఉచితంగా మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మక్ కళ్యాణ్ కుమార్ కాలనీ వాసులకు మొక్కలను పంపిణీ చేస్తూ, ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు.పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ఉరటి మహేష్, ప్రధాన కార్యదర్శి రహీమ్,మున్సిపల్ సిబ్బంది శంకర్,రాకేష్,సాకేత్,యూత్ కాంగ్రెస్ నాయకుడు అంబాల అరవింద్, శ్రీను,కాలనీ మహిళలు ప్రతినిధులు కాలనీ వాసులు పాల్గొన్నారు.

**అమీన్‌పూర్‌లో రూ.16.53 కోట్ల అభివృద్ధి పనులకు**

# శంకుస్థాపన చేసిన మంత్రి వివేక్ వెంకటస్వామి



**వాస్తవం : పటాన్‌చెరు**

పటాన్‌చెరు నియోజకవర్గంలోని బీరంగూడ,అమీన్‌పూర్ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 16.53 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ,కర్మాగారాలు,గనులు భూగర్భ శాస్త్ర శాఖల మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి శంకుస్థాపన చేశారు.సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అమీన్‌పూర్ సర్కిల్-47లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్మన్ డీసీసీ ప్రెసిడెంట్ నిర్మల జగ్గారెడ్డి, పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ మంత్రితో కలిసి పాల్గొన్నారు.ఈ నిధులతో బీరంగూడ (వార్డు--270), అమీన్‌పూర్ (వార్డు--271) ప్రాంతాల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, వర్షపు నీటి కాలువలు, స్మశానవాటిక అభివృద్ధి, సెంట్రల్ మీడియన్ నిర్మాణం తదితర మౌలిక సదుపాయాల పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ పట్టణ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి, బీరంగూడ ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, పటాన్చెరు మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం, సుధాకర్ గౌడ్, సురేష్, ప్రవీణ్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**తెలంగాణ ఉద్యమ వైతాళికుడు**

# అక్షర సేనాని దాశరథి జయంతి



**వాస్తవం : వేములవాడ**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అక్షరాన్ని ఆయుధంగా మలిచి,నిజాం నిరంకుశ పాలనపై ధిక్కార స్వరం వినిపించిన తెలంగాణ మహాకవి దాశరథి కృష్ణమాచార్య 101వ జయంతి సందర్భంగా వేములవాడ పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్కుర్తి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో దాశరథి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దశరథి చిత్రపటోనికు పూలదండలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్ వాడీ ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, పులి శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్ కేంద్రాలను పరిశీలించిన

# బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి

**ఓటర్లకు ప్రత్యేక అవగాహన కల్పించాలని అధికారులకు సూచన**

**ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో ప్రతి ఓటర్ పాల్గొనాలని విజ్ఞప్తి**

**మేడిపల్లి : వాస్తవం**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ పరిధిలోని వివిధ కాలనీలలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్ కేంద్రాలను మాజీ జెడ్పిటిసి, బోడుప్పల్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ పలువురు నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంద సంజీవరెడ్డి హెల్ప్ డెస్క్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు,చేస్తూ, ప్రతి ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఎన్యూమరేషన్ ఫారంలను నిర్ణీత సమయంలో సమర్పించాలని ఓటర్లను కోరారు. ఈ



కార్యక్రమంలో బోయిని బిక్షపతి,ఏనుగు లక్ష్మయ్య,బండారం నగేష్ గౌడ్, బండారం శ్రీధర్ గౌడ్, ఎల్లగొని శ్రీహరి గౌడ్, మన్నే ప్రభాకర్ రెడ్డి, మైసగళ్ళ శ్రీకాంత్, ఎర్రగుడ్ల సత్యమూర్తి యాదవ్, సామల బాల్ రెడ్డి సంబంధిత అధికారులు, బి ఎల్ వో లు లు, బి ఆర్ ఎస్, బి ఎల్ ఏ లు తదితరులు పాల్గొన్నారు.

### వర్షాకాలంలో వచ్చే వ్యాధులు

# నివారణా చర్యలపై అవగాహన కరపత్రం ఆవిష్కరణ

**వాస్తవం : శేర్లింగంపల్లి**

"వ్యాధికి చికిత్సకన్నా నివారణమిన్న, మరియు ఇలాంటి కరపత్రాల వలన వ్యాధులపట్ల అవగాహన పెరుగుతుంది" అని డాక్టర్ సుధాకర్ బండారి అన్నారు.ఈరోజు ఉదయము వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, లక్షణాలు మరియు వాటి నివారణ చర్యలపై ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ముద్రించిన అవగాహన కరపత్రాన్ని కొండాపూర్ డివిజన్ పరిధిలో గల రంగారెడ్డి జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ నందు ఆవిష్కరణ చేయడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ సుధాకర్ బండారి (ఇంచార్జ్ సూపరింటెండెంట్) లు కరపత్రాన్ని ఆవిష్కరించి, ఈ సందర్భంగా మాట్లాడుతూ,మనకున్న ఎండాకాలం, వర్షాకాలం,చలికాలం వంటి మూడు కాలాలలో వర్షాకాలంలోనే ఎక్కువగా వ్యాధులు (సీజనల్ డిసీజెస్) ప్రబలే అవకాశం ఉంటుంది.ముఖ్యంగా అతిసారం,డెంగ్యూ,మలేరియా, మెదడువాపు వ్యాధులతో పాటు గత కొన్ని సంవత్సరాలుగా కోవిడ్ వేరియంట్ లాంటి వ్యాధులు కూడా విజృంభిస్తున్నాయి. మానవుడు జీవితంలో తను అనుకున్నది సాధించాలంటే సంపూర్ణ ఆరోగ్యవంతునిగా ఉన్నప్పుడు మాత్రమే సాధ్యమవుతుంది. కావున కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకొన్నచో మన ఆరోగ్యం మన చేతులలోనే ఉంటుంది. మనం తినే ఆహారము సరైన వేళలలో తీసుకోవడం మంచిది. వీలైనంతవరకూ బయటి ఆహారాన్ని వినియోగించడం మానాలి. ఆహారాన్ని, ఆహార పదార్థాలను తగు పాళ్ళలో ఉడికించి, వేడి పదార్థములనే తినాలి. ఐస్ క్రీము, కూల్ డ్రింక్స్ వంటి వాటిని పరిశుభ్రంగా ఇంట్లోనే తయారు చేసుకుని వాడటం చాలా మంచిది. నాణ్యతా ప్రమాణాలను పాటించే కంపెనీల ఉత్పత్తులనే కొనుగోలు చేయాలి. ఆహార పదార్థాలపై ఈగలు, బొద్దింకలు వంటి కీటకాలు వా



లకుండా చూసుకోవాలి. భోజనానికి ముందు ప్రతిసారి చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. పరిసరాలను శుభ్రంగ ఉంచుకోవాలి.కాచి చల్లార్చి వడపోసిన మంచి నీటినే త్రాగాలి. ఇంటి ఆవరణలో మరియు బయటి పరిసరాలలో మురుగునీరు లేదా వర్షపునీరు నిలువ ఉండకుండా చూసుకోవాలి. ఇలాంటి కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకొన్న యెడల మన ఆరోగ్యం మన చేతులలోనే ఉంటుంది.'ఆరోగ్యమే మహాభాగ్యం 'కావున ఎటువంటి అనారోగ్య సమస్య వచ్చినా అశ్రద్ధ చేయకుండా వెంటనే డాక్టర్ ను సంప్రదించి వారి సూచనలు, సలహాలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడు కోవాలి అని అన్నారు. అలాగే " నిత్యము వ్యాయామము, నడక, ఆసనాలు, ధ్యానం మొదలైనవి పాటించడంతో పాటు పౌష్టికాహారం,తృణధాన్యాలు మరియు ఎక్కువ పీచు పదార్థాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలి. బయటికి వెళ్ళినపుడు మాస్కును ధరించడం మంచిది" అని తెలిపారు.ఈ కార్యక్రమంలోఆర్ ఎం ఓ డాక్టర్ విజయ కుమారి మరియు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శ్రీమతి తాటిచర్ల వరలక్ష్మి,జి వి. రావు, పాలం శ్రీను, కొక్కుల జనార్దన్, విష్ణుప్రసాద్, శ్రీమతి అనూష, కొవ్వూరి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ భీమేశ్వర స్వామిని దర్శించుకున్న

# జూనియర్ సివిల్ జడ్జి



**వాస్తవం : వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ని ఆంధ్రప్రదేశ్ అమరావతికి చెందిన జూనియర్ సివిల్ జడ్జి లిఖిత బుధవారం తమ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం నిర్వహించి,కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక దర్శనం చేసుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు.అనంతరం స్వామివారి మండపంలో ఆలయ అర్చకులు,వేద పండితులు లిఖిత,వారి కుటుంబ సభ్యులకు స్వామి-అమ్మవార్ల శేష వస్త్రాలు,లడ్డు ప్రసాదాన్ని అందజేసి వేదాశీర్వచనం చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు జి శ్రీనివాస్ శర్మ, ప్రోటోకాల్ పర్యవేక్షకులు పెరుక శ్రీనివాస్, ఆలయ ఉద్యోగులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# నీటి సంరక్షణ ప్రతీ పౌరుని బాధ్యత

**మున్సిపల్ చైర్మన్ రఘునందన్ రెడ్డి**



**వాస్తవం : తిరుమలగిరి**

తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలో జల్ సంచయ్ జన భాగీదారి 3.0లో భాగంగా 3,14 వ వార్డులలో క్యాచ్ ది రెయిన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సంకేపల్లి రఘునందన్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు తాగునీటి కొరత ఏర్పడకుండా చూడాల్సినబాధ్యత ప్రతిఒక్కరు తీసుకోవాలన్నారు. ప్రతి పౌరుడు వర్షపు నీటిని ఒడిసిపట్టే చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి ఇంటిలో రెయిన్వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసి భూగర్భ జలాలను పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకన్న మాట్లాడుతూ నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు. వర్షపు నీటి సేకరణ ద్వారా భూగర్భ జలాల మట్టాన్ని పెంచుకోవచ్చన్నారు. ప్రజలందరూ ఇంకుడు గుంతలు,రెయిన్వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలతో వర్షపు నీటి సంరక్షణ పై ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్, కౌన్సిలర్లు,ప్రజా ప్రతినిధులు,మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ఆర్ పి లు,ప్రజలు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీకేజీ పై బాధ్యులపై పీడీ యాక్ట్ పెట్టాలి

**వర్కల శివకిశోర్ గౌడ్**

**మేడిపల్లి : వాస్తవం**

నీట్ పేపర్ లీకేజీలు,విద్యా వ్యవస్థలో అక్రమాలకు పాల్పడే నిందితులపై 'పీడీ యాక్ట్' నమోదు చేసి 10 సంవత్సరాల వరకు బెయిల్ రాని చట్టాన్ని పార్లమెంట్లో బిల్లు రూపొందించాలని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర కో- కన్వీనర్ వర్కల శివ కిశోర్ గౌడ్ డిమాండ్ చేసారు.అలాగే న్యాయబద్ధంగా జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థి నాయకులపై విద్యార్థులపై ఎలాంటి కేసులు లేకుండా బేషరతుగా విడుదల చేయాలని వర్కల శివ గౌడ్ ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. నీట్ యూజీ 2026 పేపర్ లీక్ వల్ల 22.79 లక్షలాది మంది విద్యార్థుల జీవితాలపై తీవ్రమైన దుష్ప్రభావాన్ని చూపుతున్నాయి. ఎంతో మంది విద్యార్థులు తమ భవిష్యత్ బంగారు బాటల వైపు అడుగులు వేస్తున్నాయాని కన్న కలలు, కల కలగానే మిగిలిపోయాయని కుమిలి పోతున్నారు. అంకితభావంతో చదివిన విద్యార్థులకు అన్యాయం జరగడం, పేపర్ లీకేజీ వల్ల పరీక్షల రద్దు చేసి మళ్ళీ నిర్వహించిన సంగతి విధితమే, దీని వల్ల విద్యార్థులు మానసిక ఒత్తిడి మరియు ఆత్మహత్యల వంటివి వారి భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం దీనిపై స్పందించి భవిష్యత్ లో ఎలాంటి



ప్రభుత్వ పరీక్షలకు సంబందించిన పేపర్ లీకేజీ చేస్తే 10 సంవత్సరాలు కఠిన శిక్షలు అమలయ్యేల చట్టం రూపొందించాలని ఆయన అన్నారు.

# పేకాట స్థావరంపై దాడి ఐదుగురి అరెస్టు



**వాస్తవం : మద్నూర్**

కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని తడిహిప్పర్గ గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఇందులో ఐదుగురు పేకాట రాయుళ్లను పట్టుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు బుధవారం మధ్యాహ్నం నిర్వహించిన దాడిలో రూ.5,400 నగదు, మూడు సెల్ఫోన్లు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మోహన్ రెడ్డి తెలి పారు.నిందితులపై గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

# ఎమ్మెస్ అగర్వాల్ పరిశ్రమను తొలగించాలని మంత్రి వివేక్‌కి వినతి

### జనసేన పార్టీ నాయకులు కమ్మరి శ్రీను

**వాస్తవం : మనోహరాబాద్**

మనోహరాబాద్ మండలంలోని రంగాయిపల్లి,చెట్ల గౌరారం గ్రామాల పరిధిలో ఉన్న ఎమ్మెస్ అగర్వాల్ పరిశ్రమ విస్తరణ ను నిలిపివేసి,వీలైనంత త్వరగా పరిశ్రమను తొలగించాలని గజ్వేల్ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు కమ్మరి శ్రీను జిల్లా ఇన్చార్జ్ మంత్రి వివేక్‌కి బుధవారం వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెస్ అగర్వాల్ పరిశ్రమ నుంచి వెలువడుతున్న దుమ్ము,పొగ, కాలుష్యం వల్ల రెండు గ్రామాల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని,అలాగే వ్యవసాయ భూములు,భూగర్భ జలాలు,పర్యావరణం కూడా ప్రభావితమవుతున్నాయని పేర్కొన్నారు.ఈ సమస్యపై గ్రామస్తులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం లభించలేదన్నారు.పరిశ్రమ నుంచి వస్తున్న కాలుష్యం కారణంగా రెండు గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఎమ్మెస్ అగర్వాల్ పరిశ్రమ గ్రామాల సమీపం నుంచి తొలగించాలని మంత్రిని కోరారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు..



# నేడు ఐఓసీలో 3 జిల్లాల అధికారులతో సమీక్ష సమావేశం

### ముందస్తు ఏర్పాట్లు క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్

**వాస్తవం : హుస్నాబాద్**

హుస్నాబాద్ ఐఓసిలో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నంప్రభాకర్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ నియోజకవర్గ 7 మండలాలకు సంబంధించి వానకాలం 2026 ఎల్ నీ నో ప్రభావం ఎదుర్కునేందుకు ఆయా శాఖల అధికారులతో నిర్వహించనున్న సమీక్ష సమావేశ ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె. హైమావతి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎల్ నీ నో ప్రభావం ఎదుర్కునేందుకు నిర్వహించే సన్నాహక సమావేశానికి 3 జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ, ఉద్యానవన, గ్రామపంచాయతీ, గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల, విద్యుత్ శాఖల అధికారులందరికీ వారి యొక్క యాక్షన్ ప్లాన్ తెలపడం కోసం ప్రొజెక్టర్ ఏర్పాటు చెయ్యాలని, జిల్లాల వారిగా అధికారులకు సిట్టింగ్, 3 జిల్లాలు 7 మండలాల వారికి వాటర్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.ఉదయం నుండి సాయంత్రం దాకా కొనసాగుతుందని మధ్యాహ్నం లంచ్ ఏర్పాటు సైతం చెయ్యాలని, ఈ కార్యక్రమం ఫర్నిచర్, మైక్ సెట్టింగ్, నిరంతర విద్యుత్, టీ స్నాక్స్, డ్రింకింగ్ వాటర్, మధ్యాహ్న భోజనం ప్రతిదీ ఎక్కడ కూడా లోటు కాకుండా చూసుకోవాలనీ ఆర్డీఓ రామ్మూర్తి ని ఆదేశించారు.



# కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

### నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలి
### ఎన్‌టిఏను రద్దు చేయాలి
### ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా లో నిరసన

**వాస్తవం : సిరిసిల్ల**

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సిరిసిల్లలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బుధవారం నీట్ విద్యార్థులకు న్యాయం జరగాలని జంతర్మంతర్ దగ్గర నీట్ విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం చేసినటువంటి దాడులను ఖండిస్తూ విద్యార్థులతో కలిసి నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా విధానాలు దేశంలోని సుమారు 22 లక్షల మంది నీట్ పరీక్ష రాసిన విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నటు వంటి విధంగా ఉన్నాయని తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నీట్ పరీక్షలకు సంబంధించిన విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులు శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుండగా, కేంద్ర ప్రభుత్వం పోలీస్ బలగాలను వినియోగించి టియర్ గ్యాస్, రబ్బర్ బుల్లెట్లు, వాటర్ కెనాన్లు ప్రయోగించి, లాఠీ ఛార్జ్ చేయడం అత్యంత దారుణమని ఖండించారు. విద్యార్థులపై ఇలాంటి అణిచివేత చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, తమ హక్కుల కోసం ప్రశ్నించే యువతను బలవంతంగా అణచివేయడం సరైన పద్ధతి కాదని మండిపడ్డారు.ఈ ఘటనలో పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడడం బాధాకరమని పేర్కొంటూ, గాయపడిన వారందరికీ తక్షణమే నాణ్యమైన వైద్యం అందించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఉన్న ప్రభుత్వం, వారి గొంతును నొక్కివేయడానికి ప్రయత్నించడం తీవ్రమైన నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. అలాగే నీట్ పరీక్షలను ఎన్‌టిఏ ద్వారా కేంద్రీకృతంగా నిర్వహించడం వల్ల పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ప్రతి రాష్ట్రం తమ రాష్ట్రంలోనే పరీక్షలను నిర్వహించేలా అధికారాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్‌టిఏను పూర్తిగా రద్దు చేసి పారదర్శకమైన, విద్యార్థులకు అనుకూలమైన వ్యవస్థను అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించి వెంటనే కేంద్ర విద్యా శాఖ మంత్రిని భర్తరఫ్‌చేయాలని, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేని పక్షంలో ఈ దేశ రాష్ట్ర వ్యాప్తంగా మరింత ఉధృతమైన ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రషీద్ , రిషి, మనోజ్, భువనేశ్వర్, నిఖిల్, చందు, చరణ్, అరుణ్, వినయ్, శ్రీశంక్, లవేశ్వర్, సాయి, తౌహీద్, తదితరులు పాల్గొన్నారు.





## కేంద్ర విద్య శాఖ మంత్రి రాజీనామా చేయాలి

### రాహుల్ గాంధీ అరెస్ట్ అమానుషం

**వాస్తవం : సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సిరిసిల్ల గాంధీ చౌక్ లో బుధవారం లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నాయకుల అరెస్టులను ఖండిస్తు శాంతియుత నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన అక్రమాలపై బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడటం,ప్రజాస్వామ్య హక్కులను గౌరవించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకుల అరెస్టులు, నిరసనలకు అడ్డంకులు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు




**వాస్తవం : ధర్మారం**

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని బుధవారం రోజున లయన్స్‌క్లబ్ అధ్యక్షులు సిహెచ్.నర్సింగం ఆధ్వర్యంలో జాతీయ జండా ఆమోద దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాతో ర్యాలీ, బస్టాండ్ ఆవరణలో చెట్లు నాటే కార్యక్రమం.ప్రయాణ ప్రాంగణం లో 100మందికి షుగర్ పరీక్షలు చేసి 20మందికి వ్యాధి నిర్ధారణ చేయడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా మైక్రో క్యాబినెట్ సభ్యులు లయన్ తన్నీరు రాజేందర్,జె సి.లయన్ తలమక్కి రవీందర్ శెట్టి, జి ఎంటి జి సపోర్ట్ మెంబర్ పి . మునిందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి లయన్ కట్ట రమేష్, ట్రెసరర్ లయన్ కదారి కుమార్,వీపీ 1లయన్ బోట్ల లక్ష్మినర్సయ్య, పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ ఇప్ప మల్లేష్,పాస్ట్ సెక్రెటరీ భూతగడ్డ రవి,లయన్ అక్కెనపెల్లి చంద్రయ్య ప్రజలు,విద్యార్థులు పాల్గొన్నారు.

### అనధికారిక మసీదు నిర్మాణంపై

# కలెక్టర్‌కు ఫిర్యాదు



**వాస్తవం : రాజేంద్రనగర్**

ఎలాంటి అనుమతులు లేకుండా అనధికారికంగా మసీదును నిర్మించడం తగదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కాలనీవాసులు.గురువారం శంషాబాద్ ప్రకాష్ నగర్ కాలనీ వాసులు జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ..కాలనీ మధ్యలో మహమ్మద్ షరీఫ్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా మసీదును నిర్మిస్తున్నాడని సూచించారు.ఈ ప్రాంతంలో ఎక్కువ మంది హిందువులు నివాసం ఉంటున్నారని తెలిపారు. అలాంటిది కాలనీ దగ్గరలో మసీదును నిర్మించడం వల్ల రెండు మతాల మధ్య గొడవలు జరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు.ఈ సమస్యను పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని కలెక్టర్ కు వివరిస్తూ వినతి పత్రం అందజేశామని నర్ర పాండు, నర్రగిరి,నర్రా శ్రీను,రామారావు,చంద్రశేఖర్,ప్రేమ్ కుమార్,రాజు,జలంధర్ తెలిపారు.

## పాము కాటుతో గీత కార్మికుడు మృతి

**వాస్తవం : తంగళ్ళపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం సారాంపల్లి గ్రామంలో విషాద ఘటన.గ్రామానికి చెందిన గుగ్గిళ్ల శ్రీని వాస్ గౌడ్ (46) అనే వ్యక్తి పాము కాటుకు గురై చికిత్స పొందుతూ మృతి చెందాడు.సమాచారం ప్రకారం,నిన్న రాత్రి శ్రీనివాస్‌కు పాము కాటు వేసిందనీ గ్రామస్థుల వెల్లడి వెల్లడించారు. నేడు ఉదయం శ్రీనివాస్ నోటి నుంచి నురగ లు రావడం తో వెంటనే ఆస్పత్రికి తరలించిన కుటుంబ స భ్యులు.వైద్యుల చికిత్స పొందుతున్న సమయంలో ప్రాణాలు కోల్పోయిన శ్రీనివాస్.శ్రీనివాస్ కల్లుగీత కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిశిస్తున్నట్లు పేర్కొన్న గ్రామస్తులు.మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు.కుటుంబ పెద్దను కోల్పోవడంతో శ్రీనివాస్ కుటుంబంలో తీవ్ర విషాదం నెల కొన్నది..ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి శ్రీనివాస్ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు

# సమన్వయంతో పని చేయండి

**జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే.వి.నవీన్ యాదవ్**

**వాస్తవం : జూబ్లీహిల్స్**

తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ ఏ.జి. కాలనీ డివిజన్‌లో బుధవారం నిర్వహించిన ఎస్.ఐ.ఆర్(ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి అర్హులైన ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా బీఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.. బిఎల్ఓ లతో సమన్వయం చేసుకొని బిఎల్ఎ లు ముందుకు వెళ్లాలని అన్నారు.ఎస్.ఐ.ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని, ప్రతి బూత్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ సందర్భంగా గ్రౌండ్ స్థాయిలో ఎస్.ఐ.ఆర్ కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసు



కెళ్తూ అంకితభావంతో పనిచేసిన బీఎల్ఏలు,పార్టీ నాయకులను ఎమ్మెల్యే శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సమావేశంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎస్.ఐ.ఆర్ కో-ఆర్డినేటర్ భవాని శంకర్ , కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మనోజ్ , బీఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


సీనియర్ జర్నలిస్ట్
మానసాని కృష్ణా రెడ్డి
సంపాదకత్వం,సారథ్యంలో
నీతిని వీడకుండా
నిజాన్ని కప్పిపుచ్చకుండా
ఉన్నది ఉన్నట్లుగా
5యేండ్లుగా
నిరాటకంగా వెలువడుతూ
రెండు తెలుగు రాష్ట్రాల్లో
అశేష పాఠాకాదరణ పొందిన
నిఖార్సయిన
తెలుగు డిజిటల్ దినపత్రిక
వాస్తవం మీడియాకు
ఖాళీల మేర విలేకర్లు కావలెను

విలేకర్లు కావలెను

వాస్తవం




వివరాలకు..
9618616110
8074124190

వాస్తవం డెయిలీ.ఇన్
డిజిటల్ పత్రిక
ఉన్నది ఉన్నట్లుగా



మెరుగైన పాత్రికేయం కోసం..జర్నలిస్టుల హక్కుల సాధనకు

బలమైన గొంతుకగా ఉన్న సీనియర్ జర్నలిస్ట్
మానసాని కృష్ణా రెడ్డి జాతీయ అధ్యక్షులుగా ఉన్న
జర్నలిస్టుల సంక్షేమ సంఘం (జెఎస్ఎస్)లో నేడే సభ్యులుగా చేరండి..చేర్పించండి

వాట్సాప్ చేయండి:8074124190

జర్నలిస్టుల సంక్షేమ సంఘం
Regd.No. 914/2015
JSS
Journalists Sankshema Sangam
JOURNALISTS SANKSHEMA SANGAM
TELANGANA ANDHRAPRADESH
TRADE UNION



మానసాని కృష్ణా రెడ్డి , జెఎస్ఎస్ జాతీయ అధ్యక్షులు ,9618616110